

నేడు మంచినీటి సరఫరాలో అంతరాయం

మంచిర్యాలక్రైం, మే17 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం సంజీవయ్య కాలనీలో ఆదివారం మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని కమిషనర్ శివాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్‌టెల్ కంపెనీ కేబుల్ వేసే క్రమంలో వాటర్ సప్లై పైప్‌లైన్ పగిలిపోయినందున వాటి మరమ్మతులు చేసేందుకు ఆదివారం మంచినీటి సరఫరా అంతరాయం కలుగుతుందని పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన తెలిపారు.

కొలతల ప్రకారం యూనిఫాం కుట్టాలి

దండేపల్లి, మే 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల నుంచి తీసుకున్న కొలతల ప్రకారమే స్కూల్ యూనిఫాంలను కుట్టాలని మండల విద్యాధికారి దుర్గం చిన్నయ్య నిర్వహకులకు సూచించారు. దండేపల్లి మండలం మామిడిపల్లిలో శనివారం మహిళ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కట్టుమిషన్ కేంద్రాన్ని సందర్శించి కుట్టిన స్కూల్ యూనిఫాంలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల స్కూల్ యూనిఫామ్‌లు కుట్టడంలోనాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. స్కూల్ యూనిఫామ్స్ సకాలంలో పూర్తి చేసి పాఠశాలలు ప్రారంభం ముందే అందజేయాలన్నారు. అనంతరం కుడుతున్న మహిళ సంఘం సభ్యులకు పలు సూచనలు చేశారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

కలెక్టర్ కుమార్ దీపక్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్, పక్కన ఎమ్మెల్యే ప్రేం సాగర్‌రావు

మంచిర్యాల కలెక్టరేట్, మే17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో మౌలిక సదుపాయాలు సమకూర్చేందుకు అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. కలెక్టర్ సమావేశ మందిరంలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుతో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా వ్యవస్థను మరింతగా బలోపేతం చేస్తూ లక్షెట్టిపేట మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవసరమైన మేరకు సదుపాయాలు కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. కళాశాలల్లో విద్యార్థులకు అవసరమైన మేరకు సదుపాయాలు కల్పించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.

విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వ నూతన భవన నిర్మాణాలు చేపట్టి అందులో ఫర్నీచర్, ల్యాబ్ పరికరాలు, బోధన సామాగ్రి ఇతర అన్ని సమాగ్రి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు చిత్తశుద్ధితో పని చేయాలని విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్, జిల్లా విద్యా శాఖ అధికారులు, ఫర్నీచర్ సంబంధిత సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

బెల్లంపల్లి, మే17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మహిళలకు పలు సంక్షేమ పథకాలు అందజేస్తామని అధికారంలోకి వచ్చాక మోసం చేసిందని ఎంసీపీఐయూ పార్టీ జిల్లా కార్యదర్శి పసులేటి వెంకటేశ్ అన్నారు. శనివారం పట్టణంలోని కార్యా లయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మెనిఫెస్టోలో మహిళలకు రూ.2500, కల్యాణలక్ష్మీ చెక్కుతో పాటు తులం బంగారం అందజేస్తామని మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్న ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పాలన సాగించడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చక పోతే ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, సతీష్, రాహుల్‌లు పాల్గొన్నారు.

ధాన్యాన్ని వెంటనే రైసుమిల్లులకు తరలించాలి


కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో కిషన్

జైపూర్, మే 17 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లో వచ్చిన ధాన్యాన్ని రైసుమిల్లులకు త్వరగా తరలించాలని డీఆర్‌డీవో కిషన్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని గంగిపెల్లి, శెట్‌పల్లి, బెజ్జాల గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఆయన హమాలీలతో మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా రైతులు నష్టపోకుండా ఉండాలంటే వెంటనే ధాన్యాన్ని కాంటా వేసి మిల్లులకు పంపించాలని హమాలీలకు సూచించారు. కరీంనగర్‌లో త్వరగా లారీలు అన్‌లోడ్ అవుతున్నాయని, కరీం నగర్ మిల్లులకు తరలించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తగిన సౌకర్యాలను కల్పించాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ఏపీఎం రాజ్‌కుమార్ ఉన్నారు.

పల్లవి ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్

పేషెంట్‌కు రివిజన్ హిప్‌రిప్లేస్‌మెంట్ సర్జరీ చేసిన వైద్యుడు


పల్లవి ఆసుపత్రిలో రోగితో వైద్యులు రాజు

మంచిర్యాల కలెక్టరేట్, మే17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పల్లవి ఆసుపత్రిలో శనివారం ఓ మహిళ మోకాలికి అరుదైన శస్త్రచికిత్స చేసినట్లు ఆసుపత్రి చైర్మన్, ఆర్థోపెడిక్ వైద్యులు బొల్లబొత్తిని రాజు పేర్కొ న్నారు. శనివారం ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎడమకాలి తొంటిభాగంలో సమస్యతో బాధపడుతున్న రోగికి అరుదైన రివిజన్ హిప్ రిప్లేస్‌మెంట్ సర్జరీ విజయవంతంగా పూర్తి చేశారు. రామకృష్ణాపూర్‌కు చెందిన భాగ్యలక్ష్మీ ఎడమకాలి తొంటిభాగంలో 15 ఏళ్లుగా ఇబ్బంది పడుతోంది. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా నయం కాలేదు. కానీ పల్లవి ఆస్పత్రి వైద్యులు రోగికి శాశ్వత పరిష్కారం చూపించారు. ఈ సందర్భంగా రోగి తరుపున కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పిల్లల వైద్యనిపుణురాలు సాయిసృజ, ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ నవీన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా హనుమత్ మహా యజ్ఞం


పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

నస్పూర్, మే 17 (ఆంధ్రజ్యోతి):నస్పూర్ కాలనీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ రామ సహిత హనుమత్ మహాయజ్ఞం వైభవోపేతంగా నిర్వహించారు. కాలనీ వాసులు, హనుమాన్ దీక్ష స్వాములు పూజ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఆలయ అర్చకులు ఫణికుమార్ శర్మ బృందంచే వేద పండితుల మంత్రోచ్ఛారణలతో యజ్ఞం కొనసాగింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ పూజ కార్యక్రమానికి అతిథులుగా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, బీజేపీ నేత వెరబెల్లి రఘునాథ్ హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు, హనుమాన్‌దీక్ష స్వాములు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి


అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

బెల్లంపల్లి, మే17(ఆంధ్రజ్యోతి): సరస్వతీ పుష్కరాలకు ఆహ్వానించకుండా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీక్రిష్ణను అవమానించిన మంత్రి శ్రీధర్‌బాబుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు అమలు చేయాలని దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు అన్నారు. శనివారం పట్టణలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో మంత్రి శ్రీధర్‌బాబు ప్రొ టోకాల్ పాటించకుండా సరస్వతి పుష్కరాల్లో ఎంపీ గడ్డం వంశీకృ ష్ణను అవమాన పరిచాడన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుంబాల రాజేశ్, చిలుక రాజు నర్సు, గోపాల్, ఐలయ్య, రాజలింగు, మురళి పాల్గొన్నారు.

నగర సుందరీకరణకు రూ.78కోట్లు మంజూరు

ఎమ్మెల్యే ప్రేం సాగర్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేం సాగర్‌రావు

మంచిర్యాలక్రైం, మే17 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల నగర పాలక సంస్థ వ్యాపార ప్రాంతాల రహదారులను సుందరీకరణ చేసేందుకు 78కోట్ల రూపాయలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శనివారం వ్యాపారస్తులతో కలిసి మార్కెట్ సమీపంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్, శ్రీనివాస్‌టాకీస్, వెంకటేశ్వర టాకీస్, కాలేజీ, శ్రీవిశ్వనాథ ఆలయం ప్రాంతాలలో సుందరీకరణకు శ్రీకారం చుట్టామన్నారు. రహదారుల విస్తరణ, భూగర్భ మురికి కాలువలు, ఫుట్‌పాత్ నిర్మాణ పనులను జూన్‌లో ప్రారంభి స్తామన్నారు. ఆలయం దుకాణాల సముదాయంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కట్టడాల ను తొలగిస్తామన్నారు. తన ఇంటి ముందు నుంచి టూటౌన్ అనుసందానంగా ఓవర్ బ్రిడ్జి నిర్మాణం రెండు నెలల్లో చేపడుతామన్నారు. 2027 సంవత్సరానికి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం పనులు పూర్తి చేసి ప్రారంభించి ప్రజలకు అంకితం చేస్తామని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో పేద వారికి ఆదునిక వైద్యసేవలు అందిస్తామని భరోసా ఇచ్చారు.

వారంలో ఐటీ పార్కు...

వేంపల్లిలో ఇండస్ట్రీల్ పార్కు ఏర్పాట్ల ప్రక్రియ వారం రోజుల్లో పూ ర్తవుతుందని లే-అవుట్ భూమి కేటాయింపు ఎలా అనే అంశంపై నిర్ణయం తీసుకొని సకల సౌకర్యాలతో వ్యాపారస్తులకు భూమి విక్రయిస్తామన్నారు. ఐటీ పార్కులో తాను కూడ కోడిగుడ్ల ఎగుమతి, మామిడి ఇతర పండ్లు కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటు చేస్తామన్నారు. ముల్కల్ల నుంచి గోదావరినదిపై వంతెన నిర్మాణం ప్రక్రియ జరుగుతుందని ఐటీ పార్కు అనుసంధానంగా బసంత్‌నగర్ వద్ద విమానాశ్రయం ఏ ర్పాటుకు గ్రీన్ సిగ్నల్ వచ్చిందన్నారు. 45కోట్లతో ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపరచడం వల్ల విద్యార్థుల సంఖ్య 4800 మందికి పెరిగిందన్నారు.

రేవంత్‌రెడ్డికి తన నిర్ణయం నచ్చడంతో రాష్ట్రంలోని పాఠశాలల సౌకర్యాల కల్పనకు పూనుకు న్నారన్నారు. అవినీతిపై చర్చకు ప్రతిపక్షం సిద్ధమా అని ప్రశ్నించారు. చర్చకు ఎవరు వచ్చినా లెక్కలతో సహా వివరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. బీఆర్‌ఎస్‌లాగా జీవోలు తీసుకొచ్చి క్షీరాభిషేకం చేయలేదని పక్కాగా నిధులు తీసుకొస్తున్నా నని అన్నారు. స్పోర్ట్స్ స్టేడియం నిర్మించాల్సి ఉందని దాన్ని కూడ ఎన్నికల్లోపు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. 6వేల మందికి రాజీవ్ యువశక్తి కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాజామాజీ నాయకులతో పాటు వ్యాపారస్తులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువులు, కుంటలను తలపిస్తున్న రహదారులు


కొండాపూర్ యాప వద్ద రోడ్డుపై చేరిన వర్షపు నీరు

కాసిపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): మండంలోని ప్రధాన రహదారులన్ని చెరువుల, కుంటలను తలపిస్తున్నాయి. రోడ్లపై వర్షపు నీరు చేరడంతో ప్రజలు, ప్రయాణీకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అయినప్పటికీ ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. రెండు రోజులుగా మండలంలో కురుస్తు న్న వర్షాలకు సోమగూడెం టోల్‌గేటు నుంచి కాసిపేట బైపాస్ వరకు రోడ్డం తా గుంతలమయంగా మారింది. అలాగ కొండాపూర్ యాప వద్ద ప్రధాన రహదారిపై భారీ గుంతలు ఏర్పడడంతో వర్షపునీరు నిండి చిన్నపాటి జలశయాన్ని తలపిస్తుంది. సోమగూడెం నుంచి కాసిపేట 1, 2గనులతో పాటు దేవాపూర్ సిమెంట్ కంపెనీలో విధులు నిర్వహించేందుకు కార్మికులు ద్విచక్రవాహనాలతో రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి వేళల్లో నీరు నిలిచి ఉండడం వల్ల గుంతలను గుర్తించక ప్రమాదాల భారిన పడుతున్నారు. దీని విషయమై సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు, నిరసనలు చేసినప్పటికి పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చెరువు పూడికతీతను చేపట్టాలంటూ వినతి

రామకృష్ణాపూర్, మే17 (ఆంధ్రజ్యోతి): అమరావాది గ్రామంకు తాగునీరు, సాగునీటి కోసం ఉన్న చెరువు పూడిక తీయాలంటూ శనివారం గ్రామస్థులు, రైతులు, మత్స్యకారులు, మాజీ జడ్పీటీసీ యాకూబ్‌అలీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ రాజుకు వినతి పత్రం అందజేశారు. వందల ఎకరాల్లో ఉన్నటువంటి అమరావాది చెరువు సింగరేణి ఓపెన్‌కాస్టు కారణంగా మట్టి అంతా చెరువులో చేరి పూర్తిగా నిండిపోయి నీళ్లులేక అన్యాక్రాంతమైందని మాజీ జడ్పీ టీసీ యాకూబ్ అలీ అన్నారు. వెంటనే సింగరేణి అధికారులపై చర్య లు తీసుకొని సింగరేణి యజమాన్యం చెరువు పూడిక తీత చేపట్టి తిరిగి మత్స్యకారులకు రైతులకు, గ్రామస్థులు చెరువును అందుబాటు లోకి తేవాలని వినతి ప్రతంలో పేర్కొన్నారు. వినతిపత్రం అంద జేసిన వారిలో సీహెచ్ వెంకటస్వామి, ఎం. గట్టయ్య, గోనే శ్రీనివాస్, రవీందర్, పోచం ఉన్నారు.

చదువు తో పాటు నైపుణ్యం అవసరం

కేజీబీవీ సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమంలో సెక్టోరల్ ఆఫీసర్ యశోధర


ప్రశంసా పత్రాలతో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం

నస్పూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పుస్తక పఠనంతో పాటు నైపుణ్యంపై కూడ దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కేజీబీవీ సెక్టోరల్ ఆఫీసర్ యశోదర అన్నారు. నస్పూర్ కస్తూర్బా గాంధీ విద్యాలయంలో శనివారం కేజీబీవీ జిల్లా సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు వివిధ నృత్య ప్రదర్శనలు నిర్వహించి చూపరులను ఆకట్టుకున్నాయి. జిల్లాలోని 18 కేజీబీవీల నుంచి 170 మంది విద్యార్థినులు వివిధ అంశాలపై సమ్మర్ క్యాంప్‌లో పాల్గొనగా వారికి కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీషు, స్పీడ్ మాథ్స్, పెయింటింగ్, సంగీతం, యోగా అంశాలతో పాటు శాస్త్రీయ, జానపద, నృత్యాలపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు వేసిన పెయింటింగ్స్‌ను ప్రదర్శించారు. సంగీతంలో 16 సరళీ, స్వరాలు, అన్నమయ్య కీర్తనలు, దేశభక్తి గీతాలను విద్యార్థులు ఆలపించారు. సమ్మర్ క్యాంప్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికేట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్, కేజీబీవీ ప్రిన్సిపాల్ మౌనిక, బండ శాంకరి, స్వర్ణలత, దివ్య, హేమలత, తిరుపతి, రజిత, భవాని రోజా, శారద, కవిత, రోహిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడుతున్న ఎమ్మెల్యే

మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలక్రైం, మే17 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అక్రమాలకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఆరోపించారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అభివృద్ధిలో భాగంగా ఎన్నో పనులు జరిగాయన్నారు. 2018లో 164కోట్లతో అంతర్గాం బ్రిడ్జి మంజూరు చేశామన్నారు. మంజూరు చేసిన బ్రిడ్జికి టెండర్ ప్రక్రియ, స్థల సేకరణ, అగ్రిమెంటు మట్టి పరీక్షలు కూడా పూర్తి చేశామన్నారు. గత ఎన్నికల్లో ప్రభుత్వం మారిన తరువాత ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు బ్రిడ్జి పూర్తయితే తనకు పేరు వస్తుందని బ్రిడ్జికి సంబంధించిన నిధులను లక్ష్మీటాకీస్ నుంచి అమరవీరుల స్థూపానికి రాళ్లవాగు నుంచి రంగపేట వరకు రోడ్లు వేస్తున్నారని ఆ నిధులు బీఆర్ ఎస్ ప్రభుత్వం ఇచ్చి నవేనన్నారు. మహాప్రస్తానం నిర్మాణంలో ఎన్నో అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. నాలుగు కోట్ల పనికి 11 కోట్ల బిల్లును పెంచి కమీషన్లు దండుకున్నారని ఆరో పించారు. మహాప్రస్థానం నిర్మాణ పనులపై విచారణ జరిపిం చాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల నియోజకవర్గానికి తాను తెచ్చిన నిధులకు పేర్లు మారుస్తూ శంకుస్థాపనలు చేయడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ఐబీ నుంచి క్యాతన్‌పల్లి వరకు రూ. 35కోట్ల నిధులు తమ హయాంలోనే వచ్చాయన్నారు.

- పాకిస్తాన్‌తో కాల్పుల ఒప్పందం దేశానికి అవమానమని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌కుమార్ అన్నారు. బీజేపీ పార్టీ తిరంగయాత్రను దేశ వ్యాప్తంగా ఎందుకు చేస్తున్నారో అర్థంకావడం లేదన్నారు. భారతదేశ పౌరులందరూ బీజేపీని చీదరించుకుంటున్నారని ట్రంప్ కాల్పుల విరమణ పాటించాలని మనదేశానికి చెప్పడం శోచనీయమన్నారు. అదాని కోసమే మోదీ యుద్ధాన్ని ఆపారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు తాజామాజీ ప్రతి నిధులు, టీబీజీకేఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం


కోటపల్లిలో వర్షానికి తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

కోటపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో శనివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి అపార నష్టం వాటిల్లింది. రైతులు పండించిన పంట నీటి పాలైంది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యమంతా తడిసి ముద్ద అయ్యింది. ధాన్యం తడవకుండా కవర్లు కప్పినా భారీ వర్షం కురవడంతో వరదకు ధాన్యం కుప్పలు నీటిలో తేలి యాడాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. కాగా తడిసిన ధాన్యాన్ని రైతులు ఆరబెట్టే పనిలో పడ్డారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని లేదంటే తమకు తీవ్రనష్టం కలుగుతుందని రైతులు వాపోతు న్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని త్వరగా అన్‌లోడ్ చేయక పోవడం వల్లనే కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం వర్షానికి తడిసిందని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని రైతులు కోరారు.


భీమారంలో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం

చెన్నూరు: మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసిపోయింది. కిష్టంపేట, లింగంపల్లి, సుందరసాల గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. ఒక్కసారిగా వర్షం కురిసే సరికి రైతులు ధాన్యంపై కవర్లు కప్పారు. అయినప్పటికీ కొంత నష్టం చేకూరింది.

భీమారం : మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షం వల్ల రైతుల ధాన్యం తడిసింది. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు ప్రయత్నాలు చేసినా లాభం లేకుండాపోయింది. ఆరబోసిన ధాన్యం తడిసి ముద్ద అయ్యింది. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ కవర్లు లేకపోవడంతోనే ధాన్యం తడిసిందని రైతులు పేర్కొంటున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాల్లో సరైన సౌకర్యాల్లో కొనుగోలు కేంద్రాలు ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని రైతులు తెలిపారు. మండల కేంద్రంలోని కొత్త గూడెం సమీపంలో కొందరు రైతులు వరిధాన్యం ఆర బోయగా వర్షానికి పోటు రాజేశ్వర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మల్లారెడ్డిలకు చెందిన ధాన్యం పక్కనే ఉన్న చెలిమల వాగులోకి కొట్టుకుపోయింది. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

నెన్నెల : రైతులకు ఆదార్ తరహాలో 11 నంబర్లతో కూడిన విశిష్ట గుర్తింపు కార్డు జారీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఏవో పుష్పాల సృజన కోరారు. శనివారం మండల కేంద్రంలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియపై రైతులకు అవగాహన కల్పించారు. నూతన ఐడీ కార్డుతో కేంద్ర రైతు సంక్షేమ పథకాలకు లింక్ చేస్తారని చెప్పారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని చెప్పారు. ఆమె వెంట నెన్నెల ఏఈవో రామ్‌చెందర్ ఉన్నారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి నూతన తహసీల్దార్‌గా క్రిష్ణ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహించిన క్రిష్ణ బెల్లంపల్లి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. బెల్లంపల్లి తహసీల్దార్ విధులు నిర్వహించిన జోత్స్న తాండూర్‌కు బదిలీపై అయ్యారు. నూతన బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ క్రిష్ణకు డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐలు, రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బెల్లంపల్లి: పట్టణంలోని 7వ వార్డు, 65డి, సుభాష్‌నగర్ వీధుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారించాలని శనివారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు బీజేపీ నాయకురాళ్లు వినతి పత్రం అందజేశారు. సంగీత, గోమాస కమల, పాల్గొన్నారు

భీమారం : మండల కేంద్రంలోని దలారి సత్తయ్య అనే వ్యక్తి ఇంటిపై శుక్రవారం రాత్రి పిడుగు పడడంతో ఇల్లు, ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోయాయి. ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరాడు.

నెన్నెల : మండల కేంద్రంలోని కాపువాడలో ఆదివారం నుంచి చిరుతల రామాయణం ప్రదర్శిస్తామని శిక్షకులు మల్లయ్య పంతులు తెలిపారు. కళాకారులకు రెండు నెలల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. అయిదు రోజుల ప్రదర్శ అనంతరం 23న సీతారాముల పట్టాభిషేకం ఉంటుందని పేర్కొ న్నారు.

మందమర్రిటౌన్ : కార్మికుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రవేశపెట్టిన నూతన బదిలీ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సింగరేణి సీఎండీ బలరాంకు శనివారం ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ వినతి పత్రం అందించారు. ఇటీవల విడుదల చేసిన బదిలీ నిబంధనల సర్క్యూలర్ కార్మికులకు వ్యతిరేకంగా ఉందని, దీని వల్ల కార్మికులు మనోవేదనకు గురవుతున్నారన్నారు. ఆందోళనలు చేపడతామని తెలిపారు.

రామకృష్ణాపూర్: పట్టణంలోని విజయగణపతి ఆలయంలోని హనుమాన్ ఆలయం వద్ద శనివారం మహాయజ్ఞ కార్యక్రమాన్ని వేదపండితులు సతీశ్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. పహల్గాం లాంటి దాడులు పునరావృతం కాకుండా ఉండేందుకు ఈ యజ్ఞాన్ని చేపడుతున్నట్లు అర్చకులు సతీష్ అన్నారు.

భక్తజన సంగమం


పుష్కర ఘాట్ వద్ద భక్తుల రద్దీ

- వైభవంగా సరస్వతి పుష్కరాలు
- మూడో రోజు లక్ష మందికిపైగా వచ్చినట్టు అంచనా
- కాళేశ్వరం దారిలో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్


పుష్కరస్నానానికి వస్తున్న భక్తులు

భూపాలపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): త్రివేణి సంగమం.. భక్తజన సంద్రమైంది. సరస్వతి పుష్కరాలకు మూడో రోజు భక్తజనం పోటెత్తారు. వారాంతపు సెలవులు రావడంతో శనివారం భక్తుల సంఖ్య ఊహించని స్థాయిలో పెరిగింది. కాళేశ్వర పరిసరాలు వేలాది వాహనాలతో కిక్కిరిసి పోయాయి. మూడోరోజైన శనివారం లక్ష మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలచరించారు. పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

● అకాల వర్షంతో ఇబ్బందులు

శుక్రవారం అర్ధరాత్రి భారీ వర్షం కురవడంతో కాళేశ్వరం పరిసరాలన్నీ చిత్తడిగా మారి పార్కింగ్ పాయింట్లు నిరుపయోగంగా మారాయి. మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వచ్చే దారిలో సుమారు ఏడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం ఏర్పడింది. అయినప్పటికి భక్తులు కాలినడకన పుష్కరఘాట్లకు చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించారు. పుష్కరఘాట్ సమీపంలో ఏర్పాటు చేసిన టెంట్ సిటీలో కొన్ని గదులు స్వల్పంగా ఒరిగాయి. గాలి తీవ్రతకు భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన టెంట్లు, చలువ పందిళ్లు కూలిపోయాయి. శనివారం ఉదయం నుంచే పుష్కరాలకు వచ్చే భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఈ క్రమంలో మహదేవపూర్-కాళేశ్వరం మధ్యలో సుమారు ఏడు కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఊహించని స్థాయిలో వాహనాలు రావడం, సిబ్బంది అప్రమత్తంగా లేకపోవడం ట్రాఫిక్‌జాంకు కారణమైంది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిన విషయాన్ని తెలుసుకున్న భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు యత్నించారు.

పుష్కరాలకు వీవీపీల తాకిడి..

మూడోరోజు పుష్కరాలకు వీవీపీల తాకిడి పెరిగింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పుణ్యస్నానాలాచరించారు. వీరితో పాటు ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ రావు, ఠాకూర్ మక్కాన్ సింగ్ తదితరులు కూడా ఉన్నారు. అంతకుముందు ఉపముఖ్యమంత్రి భట్టి తన సోదరుడితో కలిసి త్రివేణి సంగమం వద్ద తమ పితృదేవతలకు పిండ ప్రదానాలు చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు దగ్గరుండి పుష్కర ఏర్పాట్లను పర్యవేక్షించారని ప్రశంసించారు. మంచి మనసుతో అమ్మవారిని కోరుకుంటే అన్ని సిద్ధిస్తాయని, అమ్మ చల్లని చూపు ప్రజలపై ఉంటుందని, పుష్కర స్నానంతో సకల పాపాలు తొలగుతాయన్నారు. పుష్కరాలకొచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికార యంత్రాంగం మంచి సదుపాయాలు కల్పించిందని కితాబిచ్చారు.







'ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తా'

లక్షెట్టిపేట, మే 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమ యంలో నియోజికవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేం సాగర్‌రావు అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్‌పీఆర్ ఫంక్షన్ హాలులో దండేపల్లి, లక్షెట్టిపేట మండలాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, శాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్టీని నమ్ముకుని ఉన్న ప్రతీ కార్యకర్తకు, తనను నమ్మి ఓటు వేసి గెలిపించిన ప్రజలకు అండగా ఉంటానన్నారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో కూడా అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు వచ్చే విధంగా చూస్తానన్నారు. అనంతరం దండేపల్లి, లక్షెట్టిపేట మండలాలకుల చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, శాదీ ముబారక్. సీఎం రిలీఫ్ చెక్కులను అందజేసారు. అంతకు ముందు పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్‌లు దిలీప్ కుమార్, సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి రమేష్, పట్టణ అధ్యక్షుడు ఆరీఫ్, పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అందుబాటులోకి ఇసుక

శ్రీరాంపూర్: వచ్చే 15 రోజుల్లో ఇందిరమ్మ ఇళ్లు ఫైనల్ అవుతున్నందున ఇసుకను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు అన్నారు. తాళ్లపెల్లి ఇసుక రీచ్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వర్షాకాలం అయినప్పటికీ లబ్ధి దారుల కోసం రీచ్‌ను ప్రారంభించామన్నారు. వారికి ఇసుకను ఉచితంగా ఇస్తామని, రవాణా చా ర్జీలు భరించుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శివాజీ, నస్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ సుర్మిళ్ల వేణు, ఇతర అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కల్యాణలక్ష్మి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రేం సాగర్‌రావు

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

మందమర్రిరూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడిగట్టు గ్రామానికి చెందిన దుర్గం సాత్విక (19) శనివారం సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబీకులు, గ్రామస్థుల కథనం ప్రకారం డిగ్రీ సెకండియర్ చదువుతున్న సాత్విక శనివారం పరీక్ష రాసి ఇంటికి వచ్చింది. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంట్లోని దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. యువతి తండ్రి దుర్గం వెంకటేష్ శుక్రవారం పురుగుల మందు తాగగా కుటుంబీకులు అతన్ని మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యం పొందుతున్నాడు. కుటుంబీకులందరు అతని వద్ద ఉండగా సాత్విక ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. సంఘటన స్థలాన్ని ఏఎస్ఐ వెంకన్న పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. యువతి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

పాము కాటుతో యువతి మృతి

కౌటాల, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండాయిపేట గ్రామానికి చెందిన దుర్గం ప్రియత(26) అనే యువతి పాము కాటుతో మృతి చెందింది. ఎస్సై విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి ఇంటి వద్ద పనిచేస్తున్న సమయంలో ప్రియతను పాము కాటువేయడంతో చికిత్సకోసం కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. తెలిపారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.


ప్రియత(ఫైల్)

లింగాపూర్‌లో ఎద్దు మృతి

లింగాపూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఆడే తిరుపతి అనే రైతుకు చెందిన ఎద్దు శనివారం పాముకాటుతో మృతి చెందింది. రోజుమాదిరిగానే కొట్టంలో కట్టేసి ఉన్న ఎద్దును విడిచి పెట్టడానికి ఉదయం వెళ్లగా మృతి చెంది ఉందన్నారు. నారు నాటే సమయంలో ఎద్దు మృతి చెందడంతో రైతు దిగులు చెందుతున్నాడు. ఎద్దు విలువ సుమారు 40వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

ఇందిరమ్మ ఇళ్లను అడ్డుకోవడం సరికాదు

లింగాపూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను అటవీశాఖ అధికారులు అడ్డుకోవడం సరికాదని మండలంలోని జాముల్‌ధర గ్రామపంచాయతీ పరిధి కన్నెపల్లి గ్రామస్థులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ గ్రామానికి మొదటి దశలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందన్నారు. ఇళ్ల నిర్మాణానికి పునాదులు తవ్వుతుండగా అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడం సరికాదన్నారు.

70 సంవత్సరాల నుంచి తమ గ్రామం రెవెన్యూ భూముల్లోనే ఉందన్నారు. రెవెన్యూ పట్టా ఉండగా గ్రామం మొత్తం అటవీ భూమిలో ఉందనడం సరికాదన్నారు. వెంటనే అధికారులు స్పందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆటవీ శాఖ అధికారులను వివరణ కోరగా జిల్లా స్థాయి అటవీశాఖ అధికారుల ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విచారణ జరిపామన్నారు. అటవీ భూముల పరిధిలోకి ఇళ్ల నిర్మాణాలు రావడంతో పనులను ఆపి జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించామని తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధే ఎమ్మెల్యే లక్ష్యం

మందమర్రిటౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పెద్దఎత్తున నిధులు మంజూరు చేసి ప్రజా సంక్షేమానికి పాటు పడుతున్నారని అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ నాయకుడు బండి సదానందం యాదవ్ పేర్కొన్నారు. శనివారం మందమర్రిలో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల మందమర్రి పట్టణంలో తాపీ కార్మిక భవన నిర్మాణ సంఘం భవనానికి ప్రహరీ మంజూరు చేయించడంతో పాటు బోర్లు కూడా వేయించారు. మారుతినగర్‌లో రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో వంద కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులు 80 శాతం పూర్త య్యాయని తెలిపారు. మందమర్రిలో నూతన గనులు కావాలని సింగరేణి సీఎండీని కోరామన్నారు. చెన్నూరులో మూసివేసిన గనుల స్థానంలో ఓసీపీలను ఏర్పాటు చేయాలని కోరారని తెలిపారు. ఎమ్మెల్యేకు సామన్య ప్రజలు ఫోన్ చేసి సమస్యలు చెప్పినా స్పందించి పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. అనం తరం 23వ వార్డులో బోర్‌వెల్ పనులను ప్రారంభించారు. అనంతరం బండి సదానందం యాదవ్‌ను కాలనీ వాసులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో నీలుగాయి మృతి

బెజ్జూరు, మే, 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సులుగుపల్లి గ్రామ శివారులో శనివారం ఉదయం కుక్కల దాడిలో నీలుగాయి మృతి చెందింది. ఆహారం కోసం గ్రామ శివారులో నీలుగాయి రావడంతో కుక్కలు తరిమి తీవ్రంగా గాయపరిచాయి. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. గ్రామస్థులు ఉదయం గ్రామ శివారులోకి వెళ్లగా నీలుగాయి కళేబరం కనిపించడంతో అటవీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో సెక్షన్ ఆఫీసర్ మల్లికార్జున్ సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి కళేబరాన్ని ఖననం చేశారు.

కొత్తసార్సాలలో జింక మృతి

కాగజ్‌నగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం కొత్త సార్సాలలో కుక్కల దాడిలో జింక శనివారం మృతి చెందింది. ఉదయం గ్రామంలోకి వచ్చిన జింకను కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చటంతో వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. గాయపడిన జింకను వైద్య చికిత్స అందిస్తుండగానే మృతి చెందింది. ఈ మేరకు అటవీ శాఖ అధికారులు పూర్తి వివరాలు సేకరించి పంచనామా నిర్వహించారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

కాసిపేట, మే 17 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ పోలీ సు స్టేషన్ పరిధిలోని దేవాపూర్ పాత అంగడిబజార్ ఏరియాకు చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మన్నె శామ్సన్ ప్రశాంత్‌కుమార్(45) శుక్రవారం రాత్రి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యు లు దేవాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవాపూర్‌లో ప్రశాంత్‌కుమార్ ప్రైవేటు ఎలక్ట్రిషియన్‌గా పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఆ ఇంటి వద్ద బావిలోని కరెంటు మోటార్‌కు నీళ్ల రావడం లేదని మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ప్రశాంత్ భార్య ఏడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.


ప్రశాంత్(ఫైల్)

షార్ట్ సర్క్యూట్‌తో మెకానిక్ షాప్ దగ్ధం

దహెగాం, మే 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నిధి బైక్ మెకానిక్ షాప్ శనివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. మంటలు ఎగిసి పడడంతో ఇరుగుపొరుగు వారు గమనించి మంటలను ఆర్పివేశారు. మెకానిక్ తుషార్ మధ్యాహ్నం భోజనానికి వెళ్లగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో విలువైన స్పేర్‌పార్ట్స్ దగ్ధమయ్యాయి. సుమారు ఐదు లక్షల రూపాయలు నష్టం వాల్లిందని బాధితుడు పేర్కొంటున్నారు. ప్రభుత్వ పరంగా పరిహారం అందించాలని కోరుతున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

వాంకిడి, మే 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖమాన గ్రామానికి చెందిన శ్రీకాంత్, వాంకిడి మండల కేంద్రంలని లక్ష్మీనగర్‌కు చెందిన ఎస్‌కే రుక్సానా సెల్‌ఫోన్లు ఇటీవల పోయాయి. బాధితులు వాంకిడి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోయిన సెల్‌ఫోన్‌లను గుర్తించి శనివారం బాధితులకు అప్పగించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ పోయినా, దొంగలించబడినా సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలన్నారు. రెండు సెల్‌ఫోన్లను గుర్తించడంలో ప్రతిభకనబర్చిన కానిస్టేబుల్ నహీంను అభినందించారు.



కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

రెబ్బెన, మే 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ముష్క సమ్మయ్య తెలిపారు. శనివారం ఖైరిగూడ వద్ద ఏర్పాటు ద్వారా సమావేశంలో మాట్లాడారు. స్ట్రక్చర్ కమిటీ సమావేశం జరిగిందని, ఈ సమావేశంలో కార్మికుల సమస్యలపై ప్రధానంగా ప్రస్తావించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి సోమవారం తిరుపతి, ఖైరిగూడ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కారుణ్య నియామకం కోసం ఇంటర్వ్యూ

రెబ్బెన, మే 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉద్యోగం చేస్తూ మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగుల వారసులకు గోలేటి జీఎం కార్యాలయంలో శనివారం ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఓటు జీఎం రెడ్డి మల్ల తిరుపతి ఇంటర్వ్యూకు హాజరైన వారి సర్టిఫికేట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏరియా సర్వే అధికారి పాషా, బీపీఏఓసీ2 మేనేజర్ మహేష్, డివైపీఎం వేణు, ఖైరిగూడ సంక్షేమ అధికారి రజిని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మారుపేర్ల సమస్యను పరిష్కరించాలి

శ్రీరాంపూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో మారుపేర్ల సమస్యను పరిష్కరించాలని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. అంజయ్య, కార్యదర్శి ఎం పోచమల్లు డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మారుపేర్ల సమస్యను యాజమాన్యం దృష్టికి తీసుకుపోయినప్పటికీ దాటవేత ధోరణి అవలంబిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం స్పందించి మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రక్తపోటు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

బెల్లంపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): రక్తపోటు రాకుండా జాగ్రత్తలు పాటించాలని సింగరేణి ఏరియా ఆసుపత్రి డీవైసీఎంవో వైద్యులు మధూక ర్ సూచించారు. శనివారం ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. సింగరేణిలో చాలా మంది కార్మికులు కార్మిక కుటుంబసభ్యులు రక్తపోటుతో బాధపడుతున్నారన్నారు. జీవనశైలిలో మార్పులు చేసుకొని ఆహార నియమాలు పాటిస్తూ ప్రతి రోజు వ్యాయమం చేస్తే రక్తపోటు భారినపడకుండా ఉండవచ్చునన్నారు. అనంతరం ఇటీవల ప్రపంచ నర్సుల దినోత్సవం సందర్భంగా ఉత్తమ స్టాఫ్ నర్సుగా ఎంపికైన రంజని కుమారిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, ఏఐటీయుసీ ఫిట్ సెక్రటరీ అన్వేశ్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి జీఎం నరేందర్

రెబ్బెన: సింగరేణి ఉద్యోగులు ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ మచ్చగిరి నరేందర్ తెలిపారు. రెబ్బెన మండలం గోలేటిలోని సింగరేణి డిస్పెన్సరీలో నిర్వహించిన ప్రపంచ రక్తపోటు దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు సమతుల్యమైన ఆ హారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ రామనాథం, డీజీఎం(సివిల్) ఎస్‌.కె. మదీనా, మెడికల్ సూపరిటెండెంట్ స్టాలిన్‌బా బు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తి రుపతి, డీవైపీఎం వేణు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: ముందు జాగ్రత్తతో రక్తపోటును సులువుగా నివారించవచ్చని కేకే 1 డిస్పెన్సరీ సూపరింటెండెంట్ నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. శనివారం ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా స్థానిక కేకే 1 డిస్పెన్సరీలో నిర్వహించిన రక్తపోటు అవగాహన సదస్సులో ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంవీటీసీ మేనేజర్ గుండేటి శంకర్, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో బొగ్గు ఉత్పత్తి తగ్గకుండా చూడాలి

శ్రీరాంపూర్, మే 17 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత వర్షాలకు బొగ్గు ఉత్పత్తి తగ్గకుండా చర్యలు చేపట్టాలని సింగరేణి సీఎండీ ఎన్. బలరాం అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కొత్తగూడెంలోని సంస్థ ప్రధాన కార్యాలయం నుంచి అన్నిఏరియాల్లో జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ప్రస్తుతం భారీ వర్షాలతో ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి తగ్గే అవకాశం ఉందన్నారు. క్వారీలలో నిలిచేనీటిని తోడేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. రోజుకు కనీసం 2.2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2.4లక్షల టన్నులు రవాణా చేయాలని ఆదేశించారు. సమావేశంలో డైరెక్టర్లు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఈడీ(కోల్ మూమెంట్) సుభాని, ఈడీ (సీపీపీ) మనోహర్, జీఎం(మార్కెటింగ్) రాజశేఖర్‌రావు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి రూ. కోటి బీమా అందజేత

రామకృష్ణాపూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుడు కమిశెట్టి కిరణ్‌కుమార్ ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతి చెందడంతో కార్మికుడి కుటుంబసభ్యులకు ఎస్‌బీఐ ప్రమాదబీమా రూ. కోటి చెక్కును మంచిర్యాల రీజనల్ మేనేజర్ నితీష్‌కుమార్ గుప్తా శనివారం అందజేశారు. కాసిపేట-2 గనిలో విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కిరణ్‌కుమార్‌కు బ్యాంక్ అధికారులు రూ. కోటి ప్రమాదబీమా మొత్తాన్ని మృతుని కుటుంబ సభ్యులకు రామకృష్ణాపూర్ బ్యాంక్ ఆవరణలో అందించారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ గోపాల్, బ్యాంక్ సిబ్బంది ప్రశాంత్, రాము, వెంకటేశ్, రాజేంద్రప్రసాద్, తదితరులు ఉన్నారు.

పాక్‌కు సైనిక రహస్యాలు

(మొదటి పేజీ తరువాయి)


జ్యోతి మల్హోత్రా

అక్కడి ఎలక్ట్రానిక్ సెన్సార్లను చిత్రీకరించి వాట్సాప్, టెలిగ్రామ్‌ల ద్వారా పాక్ ఏజెంట్లకు చేరవేసిందని పేర్కొన్నారు. ఈ కేసులో జ్యోతి మల్హోత్రాని శనివారం అరెస్టు చేయగా న్యాయస్థానం ఐదు రోజుల రిమాండ్ విధించింది.

ఇలా పట్టేశారు...

చిత్రీకరించిన సైనికపరంగా సున్నితమైన వీడియోల ఫుటేజీ మొత్తాన్ని ఆమె వెంటనే పాక్ హై కమిషన్ కార్యాలయం నుంచి భారత్ బహిష్కరించిన ఉద్యోగి అహ్‌సాన్ ఉర్ రహీమ్ అలియాస్ డానిష్ నంబరుకు పంపిస్తోందని హరియాణా-పంజాబ్ సైబర్ సెల్ పోలీసులు గుర్తించారు. పోలీసులు అరెస్టు చేసిన మరో ఐదుగురి వద్దా ఆ నెంబరును గుర్తించారు. 'ఆపరేషన్ గోస్ట్ సిమ్' పేరిట చేసిన పరిశోధనలో వీరందరిని గుర్తించి అధికారిక రహస్యాలు అక్రమంగా చేరవేసిన కేసులో అరెస్టు చేశారు.

ఇఫ్తార్ విందులో...

మల్హోత్రా గత ఏడాది మార్చిలో పోస్ట్ చేసిన ఓ వీడియోలో ఢిల్లీలోని పాక్ హై కమిషన్ కార్యాలయంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం కనిపిస్తోంది. ఇందులో అక్కడి ఏర్పాట్లను ఆమె ఎంతో మెచ్చుకున్నారు. పాకిస్థాన్ మరెన్నోసార్లు వెళ్లాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. పాక్ హై కమిషన్ ఉద్యోగి డానిష్‌తో సంభాషిస్తూ ఆమె ఆ వీడియోలో కనిపించారు. గతంలో తాము కలుసుకున్న సందర్భాలనూ ప్రస్తావించారు. అతడి భార్యతోనూ చనువుగా మాట్లాడారు. సాధారణ పరిచయాన్ని మించిన సన్నిహితత్వం వారి మధ్య కనిపించింది. కాగా జ్యోతి మల్హోత్రాతో పాటు మరో ఇద్దరు మహిళలు, ముగ్గురు యువకులను హరియాణా పోలీసులు ఈ కేసులో అరెస్టు చేశారు. వీరి నెట్‌వర్క్ హరియాణా, పంజాబ్ రాష్ట్రాలతోపాటు ఉత్తర భారతమంతా విస్తరించినట్లు భావిస్తున్నారు. 'ట్రావెల్ విత్ జో' పేరిట యూట్యూబ్ చానల్ నడుపుతోన్న జ్యోతి మల్హోత్రా 2023లో పాకిస్థాన్‌కు వెళ్లింది. ఆ సమయంలో ఢిల్లీలోని పాకిస్థాన్ హై కమిషన్ కార్యాలయంలో పనిచేసే డానిష్ ఆమెకు పరిచయమయ్యాడు. ఇతడు జ్యోతికి పలువురు పాకిస్థాన్ ఏజెంట్లను పరిచయం చేశాడు. వాట్సాప్, టెలిగ్రామ్, స్నాప్‌చాట్‌ల ద్వారా జ్యోతి వారితో టచ్‌లో ఉంది. షకీర్ అలియాస్ రాణా షహబాజ్ అనే పాక్ ఏజెంట్ వారిలో ఒకడు. అతడి నంబరును జాట్ రణ్‌ధావా పేరుతో జ్యోతి సేవ్ చేసుకుంది. సామాజిక మాధ్యమాల్లో పాక్ గురించి మంచిగా ప్రచారం చేసేందుకు ఈమెను ఉపయోగించుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఒక పాక్ ఏజెంట్‌కు బాగా దగ్గరయిన జ్యోతి అతడితో ఇండోనేషియా పర్యటనకూ వెళ్లింది. కాగా డానిష్‌ను ఈ నెల 13న కేంద్రం అవాంఛనీయ వ్యక్తిగా ప్రకటించి దేశం విడిచి వెళ్లాల్సిందిగా ఆదేశించింది. జ్యోతితో పాటు పంజాబ్‌లోని మలేర్‌కోట్లకు చెందిన మరో వితంతు మహిళ గుజాల(32) కూడా ఈ కేసులో కీలక నిందితురాలు. వీసా కోసం ఈ ఏడాది ఫిబ్రవరిలో పాక్ హై కమిషన్ కార్యాలయానికి వెళ్లిన ఆమెకు డానిష్ పరిచయమయ్యాడు. అతడితో తరచూ మాట్లాడుతూ ఉండేది. పెళ్లి చేసుకుంటానని డానిష్ ఆమెకు దగ్గర అయ్యాడు. ఏప్రిల్ 23న గుజాల మలేర్‌కోట్లకే చెందిన వితంతు మహిళ బాను నస్రీనను పాక్ హై కమిషన్ కార్యాలయానికి తీసుకువెళ్లగా డానిష్ ఆమెకు మరుసటి రోజే పాక్ వీసా ఇప్పించాడు. కాగా ఈ కేసులో అరెస్టయిన మరో ముగ్గురు వ్యక్తులు మలేర్‌కోట్లకు చెందిన యమీన్ మహమ్మద్, పటియాలలోని ఖల్సా కళాశాల విద్యార్థి దేవిందర్ సింగ్ ధిల్లాన్, నుహ్‌కు చెందిన అర్మాన్. యమీన్ డానిష్‌తో కలిసి ఆర్థిక, వీసా జారీ వ్యవహారాలు నడిపాడు. ధిల్లాన్ మే 12న తన ఫేస్‌బుక్ ఖాతాలో గన్, పిస్టల్ చిత్రాలను పోస్ట్ చేశాడు. దీంతో అతడిని అరెస్టు చేసిన పోలీసులు పలు కీలక వివరాలు రాబట్టారు. గత ఏడాది నవంబరులో కర్తార్‌పూర్ కారిడార్ ద్వారా పాక్ వెళ్లిన అతడు అక్కడ ఐఎస్ఐ ఏజెంట్లకు భారత్‌కు సంబంధించిన సున్నిత సమాచారాన్ని అందజేశానని వెల్లడించాడు. అందుకు తనకు పెద్దమొత్తంలో డబ్బు ముట్టిందని చెప్పాడు. పటియాల కంటోన్మెంట్ వీడియోలూ ఇతడు పాక్‌కు పంపినట్లు గుర్తించారు. అర్మాన్ సిమ్ కార్డులు సమకూర్చడం, డబ్బు పంపిణీ వ్యవహారాలు చేశాడు. అంతేగాక పాక్ ఏజెంట్ల సూచనల మేరకు డిఫెన్స్ ఎక్స్‌పో-2025ని కూడా సందర్శించాడు. కాగా నిందితులంతా తమ నేరాలను అంగీకరించారు. పాక్ ఏజెంట్లు సమాజంలో మతపరంగా, సామాజికంగా సున్నిత మనస్తత్వం గలవారిని గుర్తించి డబ్బు, ప్రేమ, పెళ్లి పేరిట వలలో వేసుకుంటున్నారని పోలీసులు తెలిపారు.

పాలస్తీనా ప్రజలంతా లిబియాకు?

వాషింగ్టన్, మే 17: ఇజ్రాయెల్ దాడుల్లో కకావికలమైన గాజా ప్రాంతం నుంచి పాలస్తీనీయులను ఖాళీ చేయించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యంత్రాంగం కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. సుమారు పది లక్షల మంది పాలస్తీనా ప్రజలను శాశ్వతంగా లిబియాకు తరలించనున్నట్టుగా అమెరికా అధికార వర్గాలను ఉటంకిస్తూ.. ఎన్‌బీసీ న్యూస్ కథనాన్ని ప్రచురించింది. దీనికి సంబంధించి లిబియా ప్రభుత్వంతో అమెరికా సీనియర్ అధికారులు చర్చలు జరుపుతున్నారని పేర్కొంది. పాలస్తీనా ప్రజల తరలింపునకు బదులుగా అమెరికా ఫ్రీజ్ చేసిన వేల కోట్ల రూపాయల లిబియా నిధులను విడుదల చేస్తామని ప్రతిపాదించినట్టు తెలిపింది. పూర్తిగా విధ్వంసమైన గాజా పరిస్థితి ఏమీ బాగోలేదని, ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని, వారిని ఖాళీ చేయించి.. దానిని స్వేచ్ఛా ప్రాంతం(ఫ్రీడమ్ జోన్)గా అభివృద్ధి చేస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గతంలోనే ప్రకటించడం గమనార్హం. మరోవైపు పాలస్తీనా తమ మాతృభూమి అని, దాన్ని రక్షించుకునేందుకు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమని పాలస్తీనా హమాస్ సీనియర్ అధికారి బసెమ్ స్పష్టం చేశారు. లిబియాలో సుమారు 14 ఏళ్ల క్రితం అంతర్యుద్ధం చెలరేగింది. అప్పటి నుంచీ ఆ దేశంలో పరిస్థితి అస్తవ్యస్తంగానే ఉంది. లిబియా పశ్చిమ ప్రాంతంలో అబ్దుల్ హమీద్ నేతృత్వంలో, తూర్పు ప్రాంతంలో ఖలీఫా హఫ్తార్ నేతృత్వంలో పాలన కొనసాగుతోంది. మొత్తం దేశంపై పట్టు కోసం ఈ రెండు వర్గాల మధ్య అంతర్యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఇదిలా ఉండగా, ఆపరేషన్ 'గిడియాన్స్ చారియట్స్' పేరుతో ఇజ్రాయెల్ శనివారం గాజాపై విరుచుకుపడింది. ఈ దాడుల్లో 100 మంది మరణించారు. గాజా భూభాగంలో యుద్ధాన్ని ఉధృతం చేయడంలో భాగంగా అపహరణకు గురైనవారి విడుదలతో పాటు హమాస్‌ను ఓడించడం వంటి లక్ష్యాలను సాధించడానికే ఈ ఆపరేషన్ చేపట్టినట్లు ఇజ్రాయెల్ సైన్యం 'టెలిగ్రాం'లో పోస్టు చేసింది.

ట్రంప్ నోట మళ్లీ జీరో టారిఫ్ మాట!



న్యూయార్క్, మే 17: భారత సుంకాల విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి అక్కసు వెళ్లగక్కారు. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై 100 శాతం సుంకాలను తగ్గించుకోవడానికి భారత్ సిద్ధంగా ఉందంటూ మళ్లీ మొదటికొచ్చారు. ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం కోసం తానేమి తొందరపడటం లేదని చెప్పారు. తాజాగా ఓ న్యూస్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. 'ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటి. వారు వ్యాపారాలు చేయడాన్ని దాదాపు అసాధ్యం చేస్తున్నారు. ప్రతీకార సుంకాల నేపథ్యంలో అమెరికాకు 100% సుంకాలు తగ్గించుకునేందు (జీరో టారిఫ్‌ల) కు సిద్ధంగా ఉన్నారు. ఆ దేశంతో త్వరలోనే వాణిజ్య ఒప్పందం అమల్లోకి రానుంది. ఈ విషయంలో నాకేం తొందరలేదు. మాతో ఒప్పందానికి చాలా దేశాలు ముందుకొస్తున్నాయి. అందరితో ఒప్పందాలంటే మా వల్ల కాదు. ప్రస్తుతం భారత్‌తో చర్చలు జరుగుతున్నాయి' అంటూ వ్యాఖ్యానించారు. ఇదివరకు ట్రంప్ ఇలాంటి వ్యాఖ్యలే చేయగా.. భారత్ తోసిపుచ్చింది.

'నీట్' ఫలితాల విడుదలపై మద్రాస్ హైకోర్టు స్టే

చెన్నై, మే 17(ఆంధ్రజ్యోతి): 'నీట్' ఫలితాల విడుదలపై మద్రాసు హైకోర్టు స్టే విధించింది. దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్, బీడీఎస్ తదితర యూజీ వైద్య కోర్సులకు మే 4న నీట్‌ను నిర్వహించారు. పరీక్ష జరుగుతున్న సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందిపడిన తమకు మళ్లీ పరీక్ష నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేయాలంటూ తిరువళ్లూర్, రాణిపేట జిల్లాలకు చెందిన 13మంది విద్యార్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలను విచారించిన మద్రాసు హైకోర్టు... ఫలితాల విడుదలపై స్టే విధించింది.

మా ఎయిర్‌బేస్‌లను భారత్ దెబ్బతీసింది




నూర్‌ఖాన్ వైమానిక స్థావరంపై దాడి చేసింది

- తొలిసారి అంగీకరించిన దాయాది దేశం
- దాడుల విషయం ఆర్మీచీఫ్ అర్ధరాత్రి తెలిపారు
- ధ్రువీకరించిన ప్రధాని షెహబాజ్ షరీఫ్

న్యూఢిల్లీ, మే 17 : ఆపరేషన్ సిందూర్ దెబ్బ బలంగా తగిలిన విషయం ఎట్టకేలకు దాయాది దేశం అంగీకరించింది. తమ వైమానిక స్థావరాలపై భారత్ దాడులు జరిపిందని పాకిస్థాన్ తొలిసారి ఒప్పుకొంది. రావల్పిండిలోని నూర్‌ఖాన్ సహా పలు ప్రాంతాల్లోని ఎయిర్‌బేస్‌లపై ఈ దాడులు జరిగాయని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ స్వయంగా ధ్రువీకరించారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలు, ఎయిర్‌బేస్‌లపై విరుచుకుపడిన విషయం తెలిసిందే. తమ ఎయిర్‌బేస్‌లు లక్ష్యంగా దాడులు జరిగినట్టు ఈ నెల 10వ తేదీ తెల్లవారుజామున, 2.30 గంటలకు, ఆర్మీ చీఫ్ మునీర్ ఫోన్‌చేసి తనకు తెలిపారని షెహబాజ్ వివరించారు. ఆయన ప్రకటనకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. ఆ వీడియోను అనుసరించి.. ప్రధాని షరీఫ్ శుక్రవారం రాత్రి ఓ కార్యక్రమంలో మాట్లాడారు. భారత క్షిపణులు తమ లక్ష్యాన్ని చేరుకున్నాయని ఆయన అంగీకరించారని పాకిస్థాన్‌కు చెందిన జియో న్యూస్‌ను ఉటంకిస్తూ ఏఎన్ఐ వార్తాసంస్థ తెలిపింది. భారత్ దాడులను ఎదుర్కొనేందుకు స్వదేశీ సాంకేతికతతోపాటు చైనా తయారీ జెట్లను వైమానిక దళం ఉపయోగించిందని తెలిపారు. కాగా, పాక్ ప్రధాని వ్యాఖ్యల వీడియోను బీజేపీ నేత అమిత్ మాలవీయా 'ఎక్స్'లో పంచుకున్నారు. "నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ సహా ఇతర స్థావరాలను భారత్ పేల్చివేసిందని స్వయంగా పాకిస్థాన్ అంగీకరించింది. పాక్‌లో బాగా లోపలకు చొచ్చుకెళ్లి మనం జరిపిన క్షిపణి దాడుల వార్తలతో అర్ధరాత్రి ప్రధాని షెహబాజ్ షరీఫ్ నిద్రలేశారు. ఆపరేషన్ సిందూర్ విధ్వంస విస్తృతి ఏ స్థాయిలో ఉన్నదనేది ఇది తెలియజేస్తోంది" అని ఆయన తెలిపారు.

లోకం తీరు



తుర్కియేకు అమెరికా 'సైడ్ విండర్' క్షిపణులు

న్యూఢిల్లీ, మే 17 : తుర్కియేకు 304 మిలియన్ డాలర్ల విలువైన క్షిపణులను విక్రయించే ఒప్పందానికి ఇటీవల ఆమోదం తెలిపిన అమెరికా.. ఆ ఒప్పందంలో భాగంగా 60 ఏఐఎం-9ఎక్స్ సైడ్ విండర్ క్షిపణులను సరఫరా చేయనుంది. స్వల్ప శ్రేణి ఎయిర్ టు ఎయిర్ క్షిపణి అయిన సైడ్ విండర్‌ను ఎఫ్-16వీ యుద్ధ విమానాల్లో వినియోగించవచ్చు. గగనతలంలో యుద్ధ విమానాల మధ్య జరిగే పోరులో ఈ సైడ్ విండర్ క్షిపణులు అత్యంత ప్రభావం చూపుతాయి. తుర్కియే ఇటీవల 40 ఎఫ్-16వీ విమానాలను సమకూర్చుకోగా.. ఈ సైడ్ విండర్‌లతో ఆ దేశ వాయుసేన మరింత బలోపేతం కానుంది. అయితే, భారత్‌కు వ్యతిరేకంగా ఇటీవల పాకిస్థాన్‌కు డ్రోన్లు, క్షిపణులు అందజేసిన తుర్కియే.. ఈ సైడ్‌విండర్‌లను కూడా పాక్‌కు ఇచ్చే ప్రమాదం ఉంది.

బ్రహ్మోస్ క్షిపణుల కోసం మరో 20 సుఖోయ్ విమానాల అప్‌గ్రేడ్

న్యూఢిల్లీ, మే 17: పాకిస్థాన్, చైనాలకు కంటి మీద నిద్ర లేకుండా చేసేందుకు మోదీ సర్కారు కీలక నిర్ణయం తీసుకున్నది. ఆపరేషన్ సిందూర్‌లో పాక్ వెన్ను విరవడంలో బ్రహ్మోస్ క్షిపణులు కీలక పాత్ర పోషించిన నేపథ్యంలో బ్రహ్మోస్-ఏ క్షిపణులను మోసుకెళ్లేందుకు వీలుగా మరో 20 సుఖోయ్ యుద్ధ విమానాలను అప్‌గ్రేడ్ చేయాలని కేంద్రం నిర్ణయించింది. దీంతో బ్రహ్మోస్-ఏ క్షిపణులను మోసుకెళ్లే సామర్థ్యం గల సుఖోయ్ యుద్ధ విమానాల సంఖ్య 60కి చేరుకుంది. ఈ బాధ్యతను హెచ్ఏఎల్‌కి అప్పగించారు. ప్రస్తుతం 2.5-టన్నుల బ్రహ్మోస్-ఎ క్షిపణిని సుఖోయ్ విమానం మోసుకెళ్లగలుగుతుంది. ఇక నుంచి 2.8 టన్నుల బ్రహ్మోస్-ఎ క్షిపణిని 400 కి.మీలకు పైగా దూరంలోని లక్ష్యాన్ని ఢీకొట్టేలా సుఖోయ్ విమానాలను అభివృద్ధి చేస్తారు.

కాంగ్రెస్‌ను కాదని థరూర్‌కు పట్టం

(మొదటి పేజీ తరువాయి)

మా పార్టీ అధ్యక్షుడు ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీని.. అఖిలపక్షం బృందాలకు పేర్లను పంపాలని కోరారు. కేంద్ర మాజీ మంత్రి ఆనంద్ శర్మ, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగోయ్, రాజ్యసభ ఎంపీ సయ్యద్ నాసిర్ హుస్సేన్, లోక్‌సభ ఎంపీ రాజా బ్రార్ పేర్లను రాహుల్‌గాంధీ ప్రతిపాదించారు. కేంద్రం మాత్రం ఏకపక్షంగా శశిథరూర్ పేరును ప్రకటించింది. దీన్ని బట్టి, ముందుగానే పేర్లను నిర్ణయించుకుని, నామమాత్రంగా ఖర్గే, రాహుల్‌ను పేర్లివ్వాలని అడిగారని స్పష్టమవుతోంది" అని వ్యాఖ్యానించారు. ట్రంప్ మధ్యవర్తిత్వ ప్రకటనపై మోదీ మౌనం వీడడం లేదని ఎద్దేవా చేశారు.


థరూర్, రవిశంకర్, బైజయంత్, సంజయ్‌కుమార్ ఝా, కనిమొళి, సుప్రియా సూలే, శ్రీకాంత్ శిందే

ఆ ఏడుగురు ఎంపీలు వీరే..

ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించబోమనే సందేశాన్ని ఐక్య రాజ్య సమితి(ఐరాస) భద్రతామండలిలోని సభ్య దేశాలతోపాటు.. ఇతర ప్రధాన భాగస్వామ్య దేశాలకు వివరించేందుకు కేంద్ర ప్రభుత్వం శనివారం ఏడు అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది. ఒక్కో బృందంలో ఆరేడుగురు ఎంపీలతో పాటు.. సీనియర్ దౌత్యవేత్తలు, మాజీ రాయబారులుంటారు. ఈ బృందాలకు.. ఏడుగురు ఎంపీలు నేతృత్వం వహిస్తారు. వీరిలో నలుగురు అధికార ఎన్డీయే కూటమి, మరో ముగ్గురు విపక్ష ఇండియా కూటమి పార్టీల పార్లమెంట్ సభ్యులు. ఈ జాబితాలో శశిథరూర్(కాంగ్రెస్), రవిశంకర్‌ప్రసాద్(బీజేపీ), బైజయంత్ పాండా(బీజేపీ), సంజయ్‌కుమార్ ఝా(జేడీయూ), కనిమొళి(డీఎంకే), సుప్రియా సూలే(ఎన్‌సీపీ-శరద్‌పవార్), శ్రీకాంత్ శిందే(శివసేన) ఉన్నారు. ఈ నెల 22 తర్వాత ఈ బృందాలు విదేశాలలో పర్యటించే అవకాశాలున్నాయి. పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది చనిపోవడం, పాక్‌పై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రవాదంపై ఈ బృందాలు విదేశాలలో ప్రచారం చేస్తాయి.

పీవీ బాటలో మోదీ!

దౌత్య యుద్ధంపై మాజీ ప్రధాని పీవీ బాటనే ఇప్పుడు మోదీ ఎంచుకున్నట్లు తెలుస్తోంది. 1994లో కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందంటూ పాకిస్థాన్ దుష్ప్రచారం చేసింది. జెనీవాలోని ఐక్య రాజ్య సమితి మానవ హక్కుల కమిషన్‌లో తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. దాంతో పీవీ అప్పటి విపక్ష నేత వాజ్‌పేయి నేతృత్వంలో ఓ ప్రతినిధి బృందాన్ని జెనీవాకు పంపించారు. ఆ బృందంలో అప్పటి జమ్మూకశ్మీర్ సీఎం ఫరూక్ అబ్దుల్లా, సల్మాన్ ఖుర్షీద్, హమీద్ అన్సారీ ఉన్నారు. వీరి దౌత్య నీతితో పాక్ ప్రవేశపెట్టిన తీర్మానం వీగిపోయింది. 2008లో కూడా ముంబై ఉగ్రదాడుల్లో పాక్ ప్రమేయముందనే సందేశాన్ని ప్రపంచదేశాలకు అందించేందుకు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ బృందాలను పంపారు. ఇప్పుడు మోదీ కూడా.. పాక్ కుతంత్రాలపై ప్రపంచానికి వివరించే ప్రయత్నం చేస్తున్నారు.

డీ4 వ్యవస్థ కోసం బీఈఎల్, ఆర్మీ మధ్య ఒప్పందం

డ్రోన్ దాడులను సమర్థవంతంగా అడ్డుకునేందుకు దోహదపడే ఇంటిగ్రేటెడ్ డ్రోన్ డిటెక్షన్ అండ్ ఇంటర్‌డిక్షన్ సిస్టమ్ (ఐడీడీఐఎస్ లేదా డీ4)కు సంబంధించి భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్), భారత ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ శుక్రవారం ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ వ్యవస్థను మేక్ ఇన్ ఇండియాలో భాగంగా డీఆర్‌డీవో, బీఈఎల్‌లు సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. శత్రు డ్రోన్లను గుర్తించడంతోపాటు ట్రాక్ చేయడం, ధ్వంసం చేయడానికి ఐడీడీఐఎస్‌ను అభివృద్ధి చేశారు. ఇది గగనతల ముప్పుల నుంచి రక్షణ కల్పించడంలో కీలకంగా మారుతోంది. గత ఏప్రిల్ 7 తర్వాతి నుంచి అదనంగా రూ.572 కోట్ల విలువైన ఆర్డర్లను పొందినట్టు బీఈఎల్ వెల్లడించింది. సంస్థ పొందిన ప్రధాన ఆర్డర్లలో ఐడీడీఐఎస్‌తో పాటు సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ రేడియో(ఎస్‌డీఆర్), జామర్లు, విడిభాగాలు వంటివి ఉన్నాయి.

రాష్ట్రపతికి గడువు.. కేంద్రమే పెట్టింది!



2016లో రెండు మెమోలు జారీ చేసిన కేంద్ర హోంశాఖ

- రాష్ట్రాల బిల్లుల మీద 3 నెలల్లోపు ఆమోదం తెలుపాలని రాష్ట్రపతికి సూచన
- ఆ మెమోలనే ప్రస్తావించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మే 17: రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించి పంపిన బిల్లుల మీద గవర్నర్లు, రాష్ట్రపతి నిర్ణీత గడువులోపు ఆమోదముద్ర వేయాలని పేర్కొంటూ సుప్రీంకోర్టు తీర్పునివ్వటం మీద రాష్ట్రపతి తాజాగా ఆక్షేపణ తెలిపిన విషయం తెలిసిందే. అయితే, బిల్లుల ఆమోదం గడువు విషయంలో సుప్రీంకోర్టు కొత్తగా ఏమీ చెప్పలేదని, కేంద్రప్రభుత్వం గతంలో స్వయంగా విడుదల చేసిన కొన్ని అధికారిక ఉత్తర్వులనే ప్రస్తావించి, వాటిని అమలు చేయాలని నిర్దేశించిందని తాజాగా వెల్లడైంది. ప్రభుత్వ నిర్ణయాల్లో జాప్యాన్ని నివారించటం కోసం.. బిల్లులను రాష్ట్రపతి మూడు నెలల్లోపు ఆమోదించాలని సూచిస్తూ కేంద్ర హోంశాఖ 2016లో రెండు మెమోలు జారీ చేసింది. తీర్పును వెలువరించిన సందర్భంగా జస్టిస్ జేబీ పార్దివాలా వీటి గురించి ప్రస్తావిస్తూ.. 'గవర్నర్ సిఫార్సు మేరకు అందిన బిల్లుల మీద మూడు నెలల్లోపు రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని కేంద్ర హోంశాఖ పేర్కొన్న గడువు సముచితమైనదేనని భావిస్తున్నాం' అని స్పష్టం చేశారు. ఈ మేరకు 2016 ఫిబ్రవరి 4వ తేదీన కేంద్ర హోంశాఖ జారీ చేసిన తొలి మెమోను సుప్రీంకోర్టు తన తీర్పులో ఉదహరించింది. 'స్పష్టమైన నిబంధనలున్నప్పటికీ, రాష్ట్రాల బిల్లులకు సంబంధించి అనవసర జాప్యం జరుగుతోంది. దీనిని నివారించటానికి, రాష్ట్రాల నుంచి బిల్లు అందిన మూడు నెలల్లోపు తుది నిర్ణయం తీసుకోవాలి. దీనిని కచ్చితంగా పాటించాలి' అని ఈ మెమో స్పష్టంగా పేర్కొనటం గమనార్హం. అంతేకాదు, రాష్ట్రాల నుంచి వచ్చిన బిల్లులలోని అంశాల ఆధారంగా సదరు బిల్లులను సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖలకు పంపటంలో కేంద్రహోంశాఖ మధ్యవర్తిగా వ్యవహరిస్తుందని, బిల్లులోని భాష, పదాల కూర్పు, రాజ్యాంగపరమైన ఆమోదాన్ని కలిగి ఉందా? అన్నవాటిని పరిశీలించటానికి కేంద్ర న్యాయ శాఖకు పంపాలని ఆ మెమో పేర్కొంది. బిల్లును అందుకున్న మంత్రిత్వశాఖ 15 రోజుల్లోపు తన స్పందన హోంశాఖకు తెలియజేయాలని, జాప్యం జరిగితే అందుకు కారణాలు తెలపాలని స్పష్టం చేసింది. నెలలోపు ఎటువంటి స్పందన లేకపోతే, సదరు శాఖకు ఆ బిల్లు మీద అభ్యంతరాలు లేవని భావించాలని తెలిపింది.

నెలలోపు రాష్ట్రాలు వివరణ ఇవ్వాలి

2016 ఫిబ్రవరి 4వ తేదీనే కేంద్రహోంశాఖ జారీ చేసిన రెండో మెమోను కూడా సుప్రీంకోర్టు తన తీర్పులో ఉదహరించింది. బిల్లు మీద సంబంధిత కేంద్ర మంత్రిత్వశాఖకు ఏమైనా అభ్యంతరాలున్నా, మరిన్ని వివరాలు కావాలని భావించినా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు కచ్చితంగా తెలియజేయాలని, రాష్ట్ర ప్రభుత్వాలు నెలలోపు వివరణ ఇవ్వాలని ఈ మెమో పేర్కొంది. నిర్ణయాత్మక ప్రక్రియలో ఉన్న వివిధ భాగస్వాములకు గడువు విధించటం అనేది.. రాజ్యాంగ విధులను నిర్దేశించే ఆర్టికల్ 201కు ఏ రకంగానూ విరుద్ధం కాదని జస్టిస్ పార్దివాలా స్పష్టం చేశారు. ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతి పరిశీలనకు గవర్నర్ పంపిన బిల్లులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని గతంలో వచ్చిన సర్కారియా, పూంఛీ కమిషన్లు చేసిన సిఫార్సులకు తగినట్లుగానే 2016లో కేంద్రం జారీ చేసిన మెమోలు ఉన్నాయని నిపుణులు గుర్తు చేస్తున్నారు.

ముంబైలో ఇద్దరు ఐఎస్ సభ్యుల అరెస్ట్

న్యూఢిల్లీ, మే 17: ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) ఉగ్ర సంస్థకు చెందిన నిద్రాణ దళాల(స్లీపర్ మాడ్యుల్)తో సంబంధం ఉన్న ఇద్దరు వ్యక్తులను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అరెస్ట్ చేసింది. అబ్దుల్లా ఫయాజ్ షేక్ అలియాస్ డైపర్‌వాలా, తల్హా ఖాన్ 2023లో మహారాష్ట్రలోని పుణెలో ఐఈడీ తయారీ, పరీక్షలకు సంబంధించిన కేసులో నిందితులు. రెండేళ్లుగా తప్పించుకు తిరుగుతున్నారు. వీరిపై నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. వీరి సమాచారం ఇచ్చిన వారికి ఎన్ఐఏ రూ.3 లక్షల చొప్పున నగదు బహుమతిని ప్రకటించింది. తాజాగా వీరిద్దరూ ఇండోనేషియా రాజధాని జకర్తాలో తలదాచుకుంటున్నట్లు సమాచారం అందుకున్న ఎన్ఐఏ.. బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ సాయంతో అరెస్టు చేసింది. ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎన్ఐఏ వీరిని అదుపులోకి తీసుకుంది.

జన్యువును మార్చి.. మృత్యువును ఏమార్చి!

- అమెరికాలో 7 నెలల చిన్నారికి అరుదైన 'జన్యు సవరణ' చికిత్స
- భారత సంతతి వైద్యుడు కిరణ్ ముసునూరు కీలకపాత్ర


కిరణ్ అండ్ రెబెక్కా

వాషింగ్టన్, మే 17: అమెరికాలోని పెన్సిల్వేనియాకు చెందిన చిన్నారి కేజే మల్డూన్. పుట్టుకతోనే ఏదో అనారోగ్యం. పరీక్షలు చేసిన వైద్యులు 'సీపీఎస్ 1'గా పిలిచే అరుదైన జన్యులోపంగా గుర్తించారు. సగటున ప్రతి 13 లక్షల మందిలో ఒకరికి మాత్రమే వచ్చే సమస్య. ఇలా పుట్టిన చిన్నారుల్లో చాలా మంది కొన్ని నెలల్లోనే చనిపోతారు. ఒకవేళ బతికినా మానసిక, శారీరక ఎదుగుదల సరిగా ఉండక.. జీవచ్ఛవంలా బతకాల్సిందే. లక్షల మందిలో ఒకరికి వచ్చే సమస్య కాబట్టి.. దీనిపై పెద్ద స్థాయిలో పరిశోధనలు, ఔషధాల తయారీ వంటివేవీ లేవు. కానీ.. అమెరికా వైద్య నిపుణులు అత్యంత అరుదైన జన్యు సమస్యకు.. అంతే వినూత్నమైన 'జన్యు సవరణ (జీన్ ఎడిటింగ్)' చికిత్స చేసి కేజే ప్రాణాలు నిలబెట్టారు. జన్యుమార్పిడి చికిత్సల్లో ఉపయోగించే క్రిస్పర్ విధానం సాయంతో.. ఆ చిన్నారిలోని జన్యువులోని రసాయనాల అమరికలో ఉన్న లోపాన్ని సవరించారు. ఇలా 'ఓ వ్యక్తిలోని జన్యులోపాన్ని వారికే ప్రత్యేకించిన (పర్సనలైజ్డ్/ కస్టమైజ్డ్ జీన్ ఎడిటింగ్ థెరపీ) చికిత్స'తో నయం చేయడం ప్రపంచంలో ఇదే మొదటిసారి.

సరికొత్త విధానంలో రూపొందించి..

కేజే పుట్టిన రెండు వారాలకే అతడి కాలేయ కణాల్లోని ఓ జన్యువులో లోపాన్ని వైద్యులు గుర్తించారు. జీవక్రియల్లో భాగంగా మన శరీరంలో ఉత్పత్తయ్యే అమ్మోనియా, ఇతర విష పదార్థాలను నిర్వీర్యం చేసే ఎంజైమ్‌ను కాలేయం ఉత్పత్తి చేయడానికి ఆ జన్యువే కీలకం. దానిలో లోపం వల్ల ఆ ఎంజైమ్ సరిగా ఉత్పత్తిగాక.. శరీరంలో విష పదార్థాలు పేరుకుపోయి.. మెదడు దెబ్బతింటుంది. కోమాలోకి వెళ్లిపోయి, చనిపోయే ప్రమాదం ఉంటుంది. దీనిపై ఫిలడెల్ఫియా పిల్లల ఆస్పత్రి నిపుణురాలు రెబెక్కా ఆర్లెన్స్ నిక్లాస్, పెన్సిల్వేనియా యూనివర్సిటీ వైద్య నిపుణుడు, భారత సంతతికి చెందిన కిరణ్ ముసునూరు బృందం ఫోకస్ చేసింది. వినూత్నమైన ప్రయోగాత్మక చికిత్స చేసేందుకు కేజే తల్లిదండ్రులు నికోల్, కైల్‌లను ఒప్పించింది. కణాల్లోని జన్యువులను కత్తిరించి.. ఏదైనా భాగాన్ని తొలగించడానికి, అవసరమైతే అతికించడానికి వీలయ్యే 'క్రిస్పర్ కాస్9' విధానాన్ని వినియోగించింది. కేజే కాలేయ కణాలను సేకరించి పరిశోధన చేసింది. అతడి కాలేయ కణాల్లోకి చొచ్చుకెళ్లి.. లోపం ఉన్న జన్యుభాగాన్ని మార్చేలా ఆదేశాలు ఇచ్చే పదార్థాన్ని రూపొందించింది. ఇందుకోసం సుమారు ఆరు నెలల సమయం పట్టింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో కేజే (అప్పటికి ఏడు నెలల వయసు)కు దానితో చికిత్స చేసింది. రెండు నెలల పాటు పూర్తిగా పర్యవేక్షణ చేసి, చికిత్స విజయవంతమైందని తేల్చింది. ఇప్పుడు కేజే పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్టు ప్రకటించింది. జన్యుపరమైన సమస్యలతో బాధపడుతున్నవారికి ప్రత్యేకించిన చికిత్సలు చేసేందుకు ఈ ప్రయోగం మార్గం సుగమం చేసిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

నేడు నింగిలోకి నిఘా నేత్రం

- పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ ద్వారా ఈవోఎస్-09 ఉపగ్రహ ప్రయోగం



సూళ్లూరుపేట, మే 17(ఆంధ్రజ్యోతి): సరిహద్దుల్లో నిరంతర నిఘా కోసం ఉద్దేశించిన ఈవోఎస్-09 (రీశాట్-1బీ) ఉపగ్రహాన్ని పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్ నేడు నింగిలోకి మోసుకెళ్లనుంది. తిరుపతి జిల్లాలోని శ్రీహరికోట షార్ అంతరిక్ష కేంద్రం నుంచి ఆదివారం ఉదయం 5.59 గంటలకు ఈ ప్రయోగం జరగనుంది. శనివారం ఉదయం 7.59 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించారు. 22 గంటల పాటు ఈ కౌంట్‌డౌన్ కొనసాగుతుంది. ఒకటో ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్ అంతరిక్షంలోకి దూసుకెళ్లనుంది. కాగా, రాకెట్‌లో ద్రవ ఇంధనం, హీలియం, నైట్రోజన్ గ్యాస్‌ను నింపే కార్యక్రమాన్ని శాస్త్రవేత్తలు పూర్తిచేశారు. ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ శుక్రవారం రాత్రి షార్‌కు చేరుకొని ప్రయోగ వేదిక పైనున్న పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్‌ను పరిశీలించారు. రీశాట్-1బీ ఉపగ్రహం బరువు 1,696.24 కిలోలు. దేశ భద్రత, సైనిక అవసరాల కోసం దీన్ని ప్రయోగిస్తున్నారు. భారత్‌కు ఇప్పటికే అంతరిక్షంలో 50కి పైగా ఉపగ్రహాలు ఉన్నాయి. ఈ రాడార్ ఇమేజింగ్ శాటిలైట్ వాటితో జత కలవనుంది. ఇప్పటికే కార్టోశాట్-1 ఉపగ్రహం లోయర్ ఎర్త్ ఆర్బిట్‌లో తిరుగుతూ చిత్రాలు అందిస్తోంది. అయితే అది రాత్రివేళల్లో ప్రతికూల వాతావరణంలో ఉపయోగపడటం లేదు. తాజాగా పీఎస్ఎల్వీ-సీ 61 రాకెట్ ద్వారా ప్రయోగించే ఈవోఎస్-09 ఉపగ్రహంలో అమర్చిన సీ-బ్యాండ్ సింథటిక్స్ ఎపర్చర్ రాడార్ ద్వారా ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా అధిక రెజల్యూషన్‌తో కూడిన భూ ఉపరితల చిత్రాలు లభిస్తాయి.

ఐదేళ్ల దాకా సేవలు

ఈ ఉపగ్రహం ఐదేళ్లు సేవలందించనుంది. పాకిస్థాన్‌తో పాటు చైనా సరిహద్దుల్లోని సున్నిత ప్రదేశాలపై ఈ ఉపగ్రహం కన్ను ఉంటుంది. దేశ సరిహద్దు రక్షణే కాకుండా వ్యవసాయం, అటవీ, భూగర్భం, ప్రకృతి వైపరీత్యాలపై ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తుంది. రీశాట్-1బీ ఉపగ్రహం కక్ష్యలోకి చేరిన 101 నిమిషాల తరువాత తన పని ప్రారంభిస్తుంది.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు: ఎస్పీ

ఆసిఫాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు హెచ్చరించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన నాలుగు నెలల్లో జిల్లా వ్యాప్తంగా 1,785 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి, వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించామని తెలిపారు. వారిని కోర్టులో హాజరు పరచగా 646 మందికికి రూ.9,33,331 జరిమానా విధించారన్నారు. ఇంకా 1,139 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపి ప్రమాదాలకు కారణం అయితే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో ప్రతీ పోలీసు స్టేషన్ పరిధిలో ప్రతీ రోజు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు, వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామని వివరించారు. తరుచూ డ్రంకెన్ డ్రైవ్ టెస్టులో పట్టుబడిన వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్సుల రద్దుకు రవాణా శాఖాధికారులకు సిఫారసు చేస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా క్రమం తప్పకుండా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలను నిర్వ హించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. వాహనాదారులు, రోడ్డు నియమాలు పాటిస్తూ పోలీసులకు సహరించాలని కోరారు.

సిబిల్ స్కోర్ నిబంధన వెనక్కి తీసుకోవాలి

ఆసిఫాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువికాసం పథకంలో భాగంగా అర్హులను ఎంపిక చేయడానికి సిబిల్ స్కోర్ నిబంధన వెనక్కి తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సిబిల్ స్కోర్ నిబంధన విధించడం సరైంది కాదన్నారు. ఈ నిబంధనతో మారుమూల గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ నిరుపేద యువకులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. రాష్ట్రప్రభుత్వం సిబిల్ స్కోర్ నిబంధనను వెనక్కి తీసుకొని రుణాలు ఎంపికలో నిరుపేదలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

పులికి రక్షణేది?

- వేటగాళ్ల ఉచ్చుకు ఎల్లూరు అటవీ ప్రాంతంలో పెద్దపులి మృతి
- విచారణ జరుపుతున్న అటవీ శాఖ అధికారులు, అదుపులోకి ఆరుగురు అనుమానితులు
- రింగరేట్ ఘటన మరువక ముందే మరో పెద్దపులి హతం
- వీడని అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం
- ఏడాదిలోనే మూడు పులులు మృతి



కాగజ్‌నగర్ మండలం దరిగాం, రింగరేట్ అటవీ ప్రాంతంలో మృతి చెందిన పెద్దపులి (ఫైల్)

కాగజ్‌నగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): అడవికి రాజు పెద్దపులి.. వర్తమానంలో పులికే రక్షణ లేకుండా పోతోంది. పట్టించుకోవాల్సిన అటవీ శాఖ అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండటంతోనే పులులు హతమవుతున్నాయనే ఆరోపణలున్నాయి. అటవీ ప్రాంతంలో వేటగాళ్లను పోనీయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు అటవీ శాఖ అధికారులు ప్రకటనలు చేస్తున్నప్పటికీ అవి ప్రకటనలకే పరిమితమవుతున్నాయన్న ఆరోపణలున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతోనే పులులు హతమవుతున్నట్టు వన్యప్రేమికులు పేర్కొంటున్నారు. ఈఏడాదిలోనే సిర్పూరు నియోజకవర్గంలో మూడు పులులు హతం కావటం సర్వత్రా చర్చకు దారితీస్తోంది.

ఖననం చేసిన కళేబరం పెద్దపులిదే..

రెండురోజుల క్రితం పెంచికల్‌పేట మండలం ఎల్లూరు అటవీ ప్రాంతంలో పెద్దపులిని చంపేసి ఖననం చేసినట్టు వచ్చిన పుకార్లపై అటవీ శాఖ అధికారులు శుక్రవారం రాత్రి నుంచి విచారణ చేపట్టి పెద్దపులిని చంపేసినట్టు నిర్ధారణ చేశారు. పెంచికల్‌పేట అటవీ ప్రాంతం సమీపంలో తిరుగుతున్న పులి ఈ నెల 13 వరకు సీసీ కెమెరాలో ట్రాప్ కాగా, 14 నుంచి కన్పించకుండా పోయింది. అప్పటికీ ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులు వాకాబు చేసి మహారాష్ట్ర అటవీ శాఖ అధికారులతో సంప్రదింపులు చేశారు. ఈ నెల 15న పులిని చంపినట్టు, ఖననం చేసినట్టు వచ్చిన పుకార్లపై విచారణ జరుపటంతో వేటగాళ్ల అమర్చిన ఉచ్చుకు బలైనట్టు నిర్ధారణకు వచ్చారు. మృతి చెందిన పులి కళేబారాన్ని బయటికి తీయగా, చర్మాన్ని, గోళ్లను అపహరించుకుపోయారు. ఏడు సంవత్సరాలు వయస్సు ఉన్న ఆడ పులిగా గుర్తించారు. వన్యప్రాణల వేట కోసం ఈ అటవీ ప్రాంతంలో ఉన్న విద్యుత్ వైర్లకు ఉచ్చు బిగించటంతోనే పులి మృతి చెందినట్టు అధికారులు నిర్ధారణకు వచ్చారు. ఎల్లూరు అటవీ ప్రాంతంలోనే పులి తిరుగుతున్నట్టు సమాచారం ఉండటంతో అధికారులు ఎందుకు పట్టించుకోలేదని.. వీరి నిర్లక్ష్యంతోనే పులి మృత్యువాత పడినట్టు పలువురు ఆరోపిస్తున్నారు. కాని అటవీ శాఖ అధికారులు మాత్రం తాము కొన్ని నెలల నుంచి విద్యుత్ అధికారులకు పులుల కారిడార్ ప్రాంతానికి విద్యుత్ వైర్లకు ఇన్సులేషన్ ఏర్పాటు చేయాలని వినతి పత్రాలిచ్చిన కూడా పట్టించుకోలేదని పేర్కొంటున్నారు. ఇన్సులేషన్ చేస్తే పులి మృత్యువాత పడేది కాదని అటవీ శాఖ అధికారులు వివరణ ఇస్తుండటం విశేషం.

దరిగాం ఘటనలో రెండు పులులు హతం..

కాగజ్‌నగర్ దరిగాం, రింగరేట్ అటవీ ప్రాంతంలో తరుచూ ఆవులు, మేకల మందపై పులులు దాడులు చేసేవి. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు సమాచారం ఇస్తున్నా ఎలాంటి పురోగతి లేక పోవటంతో పలువురు గతేడాది జనవరి 10న విషప్రయోగం చేశారు. ఈ ఘటనలో రెండు పులులు మృత్యువాత పడటంతో రాష్ట్ర అటవీ శాఖ సీరియస్‌గా తీసుకుంది. నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ(ఎన్టీసీఏ) బృందం పూర్తి వివరాలు సేకరించి నివేదిక సమర్పించడంతో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు అధికారులపై వేటు వేశారు. ముందస్తుగానే అటవీ శాఖ అధికారులు తేరుకుంటే రెండు పులుల ప్రాణులు పోయేవి కావని వన్యప్రాణి ప్రేమికులు పేర్కొంటున్నారు. రెండ్రోజులుగా సిర్పూరు నియోజకవర్గంలో ఉన్న పులులపై కూడా నేషనల్ టైగర్ కనర్వేషన్ అథారిటి బృంద సభ్యులు కూడా విచారణ జరుపుతున్నారు.

వేటగాళ్ల ఉచ్చుకు పెద్దపులి మృతి
-ఎఫ్‌డీపీటీ శాంతరాం

కాగజ్‌నగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట ఎల్లూరు అటవీ ప్రాంత సమీపంలో రెండ్రోజుల క్రితం వేటగాళ్ల అమర్చిన ఉచ్చుకు పెద్దపులి మృతి చెందినట్టు ఫీల్డ్ డైరెక్టర్ ప్రాజెక్టు టైగర్(ఎఫ్‌డీపీటీ) శాంతరాం ప్రకటించారు. శనివారం కాగజ్‌నగర్ అటవీ డివిజనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. పెంచికల్‌పేట అటవీ ప్రాంతం సమీపంలో తిరుగుతున్న పులి ఈ నెల 13 వరకు సీసీ కెమెరాలో ట్రాక్ అయినట్టు తెలిపారు. ఈ నెల 14 నుంచి కన్పించకుండా పోవటంతో తమ సిబ్బంది వాకబు చేస్తుండగా, ఎల్లూరు అటవీ ప్రాంత సమీపంలో ఖననం చేసినట్టు ప్రచారం కావటంతో ఘటన స్థలానికి శుక్రవారం రాత్రి పరిశీలించినట్టు వివరించారు. వేటగాళ్లు అమర్చిన ఉచ్చుకు బలైనట్టు నిర్ధారించామన్నారు. పులి కళేబారాన్ని బయటికి తీయగా ఏడు సంవత్సరాల వయస్సు గల ఆడ పులి కె-8గా ప్రాథమికంగా గుర్తించామన్నారు. చర్మం, వేళ్లను వేటగాళ్లు అపహరించుకుపోయారని తెలిపారు. పులి మృతి చెందిన సంఘటనపై ఇప్పటికే పలువురుని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామన్నారు. పులి మృతిపై నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ(ఎన్టీసీఏ) బృంద సభ్యులు కూడా విచారణ జరుపునున్నట్టు తెలిపారు. వేటగాళ్లు ఉచ్చులు ఏర్పాటు చేయడానికి విద్యుత్ వినియోగిస్తున్నారని, అటువంటి వైర్లకు ఇన్సులేషన్ పెట్టాలని తాము ట్రాన్స్‌కో అధికారులకు వినతి పత్రాలు సమర్పించినట్టు పేర్కొన్నారు. సమావేశంలో ఎఫ్‌డీవో నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధికారులకు సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, గృహ నిర్మాణ శాఖాధికారులతో పైలెట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, అర్హుల జాబితా, రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులైన వారి ఎంపిక, తాగునీటి సరఫరా, నమూనా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి అంశాలపై అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పైలెట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. ఇందిరమ్మ ఇంటిని 400 చదరపు గజముల నుంచి 600 చదరపు గజాలలో మాత్రమే నిర్మించాలని, అటవీ శాఖాధికారులను సమన్వయం చేసుకోవాలని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని ఎంపిక చేసి జాబితా రూపొందించి జిల్లా స్థాయి కమిటీకి సమర్పించాలని తెలిపారు. వేసవిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరాకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామి పథకంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని, అందరికి ఉపాధి పని కల్పించాలన్నారు. సమావేశంలో డీపీఓ భిక్షపతి, ఎస్సీ అభివృద్ధి అధికారి సజీవన్, సీఈవో లక్ష్మీనారాయణ, మైనార్టీ సంక్షేమాధికారి నదీమ్, గిరిజన సంక్షేమాధికారి రమాదేవి, హౌజింగ్ పీడీ వేణుగోపాల్, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించాలి

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన శిక్షణ ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ పుస్తక పఠన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో, శిక్షణ సమన్వయకర్త శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలి

రెబ్బెన: తూకం వేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలి కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. శనివారం ఇందిరానగర్‌లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కల్లాల వద్ద తగిన ఏర్పాట్లు రైతులు చేసుకునేలా తగు సూచనలు, సలహాలు అధికారులు అందించాలన్నారు. ప్రస్తుతం అకాల వర్షం కురిసే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్క రైతు టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అధికారులు త్వరగా ధాన్యం కొనుగోలు చేయడానికి కృషి చేయాలన్నారు. అడిషనల్ కలెక్టర్ డేవిడ్, తహసీల్దార్ రాంమోహన్, ఏపీవో వెంకటరమణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు రంగులు వేయాలి

ఆసిఫాబాద్‌రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి అయ్యాయని తరగతి గదులకు రంగులు వేయాలని కోరుతూ కలెక్టర్‌కు టీఎస్‌యూటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. బడిబాట ప్రారంభానికి ముందే అన్ని పాఠశాలలకు రంగులు పూర్తి చేయించేలా చర్యలు చేపట్టాలని, పాఠశాల పెయింటింగ్ నిధులను వెంటనే విడుదల చేసి పెయింటింగ్ పూర్తయ్యేలా అధికారులను ఆదేశించాలని కోరారు. ఉపాధ్యాయులు సమగ్ర సర్వే పూర్తి చేసి వివరాలు ఆన్‌లైన్‌లో అధికారులకు సమర్పించారని కానీ నెలలు గడుస్తున్నప్పటికీ ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ చెల్లించలేదని వెంటనే చెల్లించాలని కోరారు. టీఎస్‌యూటీఎఫ్ నాయకులు శాంతికుమారి, ఊశన్న, రమేష్, సుభాష్, శ్రీనివాస్, విటో బా, సంతోష్‌కుమార్, సోనాజీ, అరవింద్ పాల్గొన్నారు.

భూ రికార్డులను సరిచేయాలి

ఆసిఫాబాద్, మే 17(ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టంలో భాగంగా రెవెన్యూ యంత్రాంగం ఆదివాసులు భూరికార్డులను సరిచేయాలని న్యాయవాది ఆనంద్‌కుమార్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో 'ఏజెన్సీలో భూ సమస్యలు- భూ భారతి చట్టం అమలు తీరు' అనే అంశంపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో భూ భారతి అమలులో ఎల్‌టీఆర్ చట్టాన్ని ఉల్లంఘించవద్దన్నారు. ఏజెన్సీలో రైతులకు రికార్డులపై అవగాహన లేక పోవడం వారికి శాపంగా మారిందన్నారు. రెవెన్యూ యంత్రాంగం గ్రామాలు, గూడాలకు వెళ్లి ఆదివాసుల భూ రికార్డులను సరిచేయాలని కోరారు. సమావేశంలో నాయకులు జనార్దన్, దేవేందర్, అర్జున్, బుర్స పోచయ్య, మోతిరాం, బాజీరావు, మాణిక్‌రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని దిష్టిబొమ్మ దహనం



ప్రధాని దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వాంకిడి, మే 17 (ఆంధ్రజ్యోతి): బీహార్‌లో రాహుల్‌గాంధీపై అక్రమంగా కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ శనివారం వాంకిడి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై కాంగ్రెస్ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు గుండా శ్యాం, ప్రశాంత్ మాట్లాడారు. దర్భంగాలోని అంబేద్కర్ హాల్‌లో దళిత విద్యార్థులను పరామర్శించేందుకు వెళ్లినందుకు రాహుల్ గాంధీపై అక్రమంగా కేసులు బనాయించడం ఎంత వరకు సమంజసమన్నారు. బీజేపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఈ- పాస్ యంత్రాల అందజేత

ఆసిఫాబాద్, మే 17 (ఆంధ్రజ్యోతి): జన్కాపూర్ రైతు వేదికలో ఎరువుల డీలర్లకు ఈ-పాస్ యంత్రాలను జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన విధంగా డీలర్లు ఎరువుల అమ్మకాలను ఈ-పాస్ యంత్రాల ద్వారా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ మిలింద్‌కుమార్, కోరమండల్ ఇంటర్నేషల్ సేల్స్ ఆఫీసర్ శ్రావణ్, వ్యవసాయాధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న తహసీల్దార్‌కు సన్మానం

సిర్పూర్(యు), మే 17(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ ఉదయ్‌కుమార్ జగిత్యాలకు బదిలీపై వెళ్తుండగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాయలంలో పలువురు నాయకులు, అధికారులు శనివారం సన్మానించారు. కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్‌రావు, మాజీ ఎంపీపీ ఆత్రం దౌలత్‌రావు, నాయకులు కుమ్ర శంకర్, భీంరావు, ప్రకాష్, కనక హన్మంత్‌రావు, శంకర్, ధర్మరావు పాల్గొన్నారు.

అకాల వర్షం..కర్షకులకు కష్టం

దహెగాం, మే 17 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో వర్షం కురిసింది. హత్తిని, దహెగాం, లగ్గాం, కుంచెవెల్లి, ఒడ్డుగూడ, చంద్రపల్లి, గిరివెల్లి గ్రామల్లోని కర్షకులు నానా తంటలు పడ్డారు. ఈదురు గాలుల వర్షం గాలి దుమారం ఒకేసారి రావడంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యపు రాశులపై కప్పిన టార్పాలిన్లు ఎగిరిపోయి ధాన్యం తడిసిపోయింది. ధాన్యాన్ని ఆరబోయడానికి రైతులు పడరాని పాట్లు పడ్డారు. ఆరబోసిన ధాన్యపు రాశులలో నిలిచిన నీటిని మహిళలు తట్టిలతో తొలగించారు. ధాన్యం బస్తాలపై కప్పిన టార్పాలిన్లపై నిలిచిన నీటిని రైతులు తొలగించారు. శనివారం కల్వాడ, దహెగాం, ఒడ్డుగూడ ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీటీ లలిత పరిశీలిం చారు. ఆమె వెంట సిబ్బంది శ్యామూల్, లక్ష్మణ్, ఏఈలు వంశీ, లావణ్య, పీఏసీ ఇన్‌చార్జి జీవన్ తదితరులు ఉన్నారు.

పెంచికలపేట: అకాల వర్షంతో అన్నదాతలకు ఇబ్బందులు తప్పడం లేదు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఎల్కపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యపు రాశులపై కప్పిన టార్పాలిన్ తొలగిపోవడంతో ధాన్యం తడిసి ముద్దయింది. ధాన్యం తరలింపులో అధికారులు జాప్యం కారణంగానే ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతున్నారు.



టార్పాలిన్లలో నిలిచిన నీటిని తొలగిస్తున్న రైతులు

సెపక్ తక్రా పోటీలకు ఎంపిక




కె కారుణ్య, టి.అనూష

రెబ్బెన, మే 17 (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇడియా సీనియర్ నేషనల్ గేమ్స్ సెపక్ తక్రా పోటీలకు రెబ్బెన మండలం గోలేటి గ్రామానికి చెందిన కుమ్మరి కారుణ్య, తోట అనూష ఎంపికైనట్టు తెలంగాణ రాష్ట్ర సెపక్ తక్రా ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 19 నుంచి 25 వరకు గుజరాత్ రాష్ట్రంలోని ఢమాన్‌లో జరుగుతున్నట్టు వివరించారు. ఎంపికైన క్రీడాకారులను తెలంగాణ బ్యాడ్మింటన్ సంయుక్త కార్యదర్శి ఎస్ తిరుపతి, తెలంగాణ రాష్ట్ర సెపక్ తక్రా సంయుక్త కార్యదర్శి శిరీష, తెలంగాణ రాష్ట్ర సెపక్‌తక్రా ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ బాస్కర్, రామకష్ణ, మల్లేష్‌తో పాటు తదితరులు అభినందించారు.

నర్సరీ పరిశీలన

కాగజ్‌నగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బారెగూడ గ్రామ పంచాయతీ నర్సరీని ఎంపీడీవో కోట ప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలుపు మొక్కలను తొలగించాలన్నారు. సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని కార్యదర్శికి సూచించారు. ఈయన వెంట ఏపీవో చంద్రశేఖర్, కార్యదర్శి విలాస్, ఫీల్డు అసిస్టెంట్, సిబ్బంది ఉన్నారు.

ఎస్పీఎం యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

కాగజ్‌నగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఎం మిల్లు నుంచి విష వాయులు వెలువడుతున్నాయని, సమీప కాలనీ వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్ఎస్ సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జి లెండుగురే శ్యాంరావు మాట్లాడుతూ రెండ్రోజుల క్రితం కూడా సెక్యూరిటీ గార్డు కూడా మృతి చెందినట్టు తెలిపారు. ఈ మృతిపై సమగ్ర విచారణ జరిపాలన్నారు. ఎస్పీఎం మిల్లులో క్లోరిన్ గ్యాస్ లీకేజీ వస్తోందని వెంటనే కాలుష్య అధికారులు స్పందించి విచారణ జరుపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నిలిచిన విద్యుత్ సరఫరా

దహెగాం, మే 17(ఆంధ్రజ్యోతి): దహెగాం మండలంలో శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో కురిసిన వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి విద్యుత్ పునరుద్ధరించినప్పటికీ తరుచు అంతరాయం చోటు చేసుకుంది. లగ్గాం, ఏనగూడెం గ్రామాల్లో గాలి వానకు చెట్లు విరగిపడ్డాయి. కుంచవెల్లి గ్రామంలో వ్యవసాయ విద్యుత్ స్తంభాలు విరిగినట్లు ఏఈ రవీందర్ తెలిపారు.

ఉపాధి హామీ ప్రజావేదిక

చింతలమానేపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామి పథకంపై శనివారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి చేపట్టిన పనులపై గ్రామాల వారీగా గ్రామ సభలో చదివి వినిపించారు. మండలంలో మొత్తం రూ.41 వేల జరిమానా విధించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో దత్తరాం, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, విజిలెన్స్ అధికారి ఆంజనేయులు, హెచ్‌ఆర్ మేనేజర్ మల్లేష్, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ రమేష్, ఏపీఓ సోయబ్ పాల్గొన్నారు.

ప్రతీ గ్రామానికి మిషన్ భగీరథ నీరందించాలి



మారుగూడలో భగీరథ నీటి సరఫరాను పరిశీలిస్తున్న అధికారులు

లింగాపూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామానికి మిషన్ భగీరథ నీరందించాలని తెలంగాణా రాష్ట్ర ఎస్ఈ రవీందర్ అన్నారు. శనివారం ఆయన లింగాపూర్ మండలంలోని వంకామద్ది-1, వంకామద్ది-2, ఘుంనూర్ కే, ఘుంనూర్ బీ, జాముల్‌ధర, నాయకపోడ్ గూడా, సిర్పూర్ యు మండలంలోని భీమన్ గూట్టా, హడప్‌నూర్, జైనూర్ మండలంలోని జామిని, కెరమెరి మండలాల్లోని గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి భగీరథ నీరు సరఫరా విధానాల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నీరు క్రమంతప్పకుండా సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట భగీరథ వాటర్‌గ్రిడ్ ఈఈ రాకేష్, ఇంట్రా ఈఈ సితిక్, డీఈ నరేష్, ఏఈఈ క్రాంతితేజా, ఏఈ అరవింద్, ప్రవీణ్ పాల్గొన్నారు.

'ఉపాధి' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జైనూర్, మే 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈజీఎస్ ఏపీవో నగేష్ కోరారు. మండలంలోని పవర్‌గూడ పరిసర ప్రాంతంలో ఉపాధి పనుల ప్రదేశంలో కూలీలతో మాట్లాడారు. కూలీలు తమతమ పంట చేనుల్లో పంటలకు నీరందేలా పనులు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా చేనులలో ఫారం పౌండ్, చెక్ డ్యాంలు వంటి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఎండలు విపరీతంగా ఉన్నందున ఎక్కువ సేపు ఎండలో పని చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి బిసె భరత్, ఫీల్డ్ అసిస్టెంట్ ఉత్తం, కారోబార్ ఉయిక జ్ఞానేశ్వర్, మెట్ భుతాలె గోవింద్‌రావ్, కూలీలు పాల్గొన్నారు.

పూలే దంపతులను స్ఫూర్తిగా తీసుకోవాలి



విద్యార్థులను సన్మానిస్తున్న మాలి సంఘం నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఉద్యమకారులు మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే దంప తులను మాలి విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని అఖిల భారతీయ మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే సూచించారు. శనివారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని అఖిల బారతీయ మాలి మహా సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇంటర్, పదో తరగతి విద్యార్థుల ప్రతిభా పురస్కారం-2025 అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే చదువు ఒక్కటే ఆయుధమని సూచించారు. మహాత్మా జ్యోతిభాపూలే, సావిత్రిబాయి పూలే దంపతులు సమసమాజ నిర్మాణం కోసం ఎనలేని కృషి చేశారని తెలిపారు. వారి అడుగు జాడల్లో నడిచి మాలి విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా చంద్రాపూర్‌కు చెందిన మోటివేషనల్ స్పీకర్ విజయ్ ముసడే పదోతరగతి, ఇంటర్ తరువాత విద్యార్థులు ఎలా రాణించవచ్చో భవిష్యత్‌ను ఎలా నిర్మాణం చేసుకోవాలో తదితర విషయాలపై అవగాహన కల్పించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహిత కేటార్ల రంగయ్య ప్రభుత్వవిద్యాలయాల్లో చదివి ప్రగతి ఎలా సాధించగలుగుతారో తన అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజ్‌కుమార్, సోషల్ వర్కర్ ప్రవీణ్‌కుమార్, తుకారాం, స్వప్న, మాలి సంఘం నాయకులు నారాయణ, శంకర్, మెంగాజీ, శ్రీకాంత్, తులసీరాం, సోమేశ్వర్, బాపురావు, కృష్ణ, సుధాకర్, నారాయణ పాల్గొన్నారు.

పీటీఎస్ సిబ్బందికి వేతనాలు పెంచాలి

ఆసిఫాబాద్‌రూరల్, మే 17(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల్లో పని చేస్తున్న పీటీఎస్ సిబ్బందికి వేతనాలు పెంచాలని శనివారం హైదరాబాద్‌లో టీఎన్జీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్‌కు సంఘం నాయకులు శనివారం వినతి పత్రం సమర్పించారు. ప్రస్తుతం రూ.7 వేలు మాత్రమే ఇస్తున్నారని రూ.20 వేలు ఇవ్వాలని కోరగా రూ.18,600 చెల్లించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు హుస్సేన్, మధు, సలీం, బుచ్చన్న, రాజారాం, శంకర్, ప్రేంసాగర్ తదితరులు పాల్గొన్నారు.